ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 20, జూలై 2025

పట్టణ ప్రజలకు అమృత్ ఘడియలు




తాగునీటి అవసరాల కోసం రూ.744.34 కోట్లు మంజూరు

అమృత్-2లో ఒంగోలు, పొదిలి మార్కాపురం, దర్శికి నిధులు

- నగరానికి ఈసారి రామతీర్థం నుంచి సరఫరా
- తొలిదశ పనులకు 2016లో ఒంగోలులో చంద్రబాబు శంకుస్థాపన
- 2017లో ప్రారంభించిన వెంకయ్యనాయుడు
- భవిష్యత్‌తరాల నీటి అవసరాలకు అనుగుణంగా రెండో దశ పనులు
- మళ్లీ టీడీపీ ప్రభుత్వం రాకతో తీరనున్న నీటి కష్టాలు

ప్రస్తుత ప్రభుత్వం రాకతో పట్టణ ప్రాంతాల్లోని ప్రజల నీటి కష్టాలు తీరనున్నాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నిధులతో అమలు చేస్తున్న అమృత్-2 కింద జిల్లాకు రూ.744.34 కోట్లు మంజూరు కావడంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. 2016లో తెలుగుదేశం హయాంలోనే ప్రారంభమైన ఈ పథకం పనులు కొంతమేర జరిగాయి. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రజల నీటి కష్టాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గడిచిన ఐదేళ్లు బిందెడు నీటి కోసం బారులు తీరిన రోజులూ ప్రజలకు ఇంకా గుర్తున్నాయి. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పథకం కింద మరిన్ని నిధులు మంజూరయ్యాయి.


రామతీర్థం జలాశయం

ఒంగోలు కార్పొరేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంత వాసుల నీటి ఇబ్బందులకు పరిష్కారం లభించింది. ఎట్టకేలకు ప్రభుత్వం తాగునీటి పథకాల కోసం నిధులు మంజూరు చేసింది. అమృత్-2 కింద ఒంగోలుకు రూ.424.42 కోట్లు, మార్కాపురానికి రూ.63.14 కోట్లు, పొదిలికి రూ.126.17 కోట్లు, దర్శికి రూ.130.61 కోట్లు కేటాయించింది. దీంతో ఒంగోలు నగరంతోపాటు పశ్చిమంలోని పట్టణ ప్రాంత ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

2016లో ఒంగోలులో శంకుస్థాపన

నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, స్మార్ట్ లుక్ తీసుకురావడానికి 2016లోనే అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం పలికింది. అదేసమయంలో కేంద్ర ప్రభుత్వం 'అమృత్' పేరిట పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణ ప్రాంతాల్లో తొలి విడతగా కొన్నింటిని ఈ పథకం కింద ఎంపిక చేసింది. అందులో నాడు ఒంగోలుకు ప్రాధాన్యం లభించింది. తొలుత రూ.330 కోట్లు అవసరమని అధికారులు కోరారు. ఒకేసారి అంతమొత్తం విడుదల సాధ్యపడకపోవడంతో ఒంగోలుకు రూ.123 కోట్లు మంజూరు చేశారు. దీంతో 2016 మేలో నాటి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నగరంలోని ప్రకాశం భవనం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

2017లో ప్రారంభించిన వెంకయ్య నాయుడు

2017 మేలో అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎం. వెంకయ్యనాయుడు ఒంగోలులో 77 శాతం పూర్తయిన పనులను ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో నేటికీ పట్టణ ప్రాంతాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో తిరిగి అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రానికి ప్రతిపాదనలు పంపి అధిక మొత్తంలో నిధులు రాబట్టింది. ఈ పథకం కింద రెండో విడతలో ఒంగోలుతోపాటు, మార్కాపురం, పొదిలి, దర్శి మునిసిపాలిటీలను కూడా చేర్చడంతోపాటు రూ.744.34 కోట్లు మంజూరు చేసింది.

నిధుల వినియోగం ఇలా..

అమృత్-2 కింద ఒంగోలు కార్పొరేషన్‌కు రెండు ప్యాకేజీల్లో రూ.424.42 కోట్లను ఖర్చు చేయనున్నారు. మొదటి ప్యాకేజీలో తాగునీటి అవసరాలకు సంబంధించిన నిర్మాణ పనులకు రూ. 320.05 కోట్లు, పది సంవత్సరాల నిర్వహణకు రూ.61.25 కోట్లు కేటాయించారు. ప్యాకేజ్-1లో 18 ఓవర్ హెడ్ ట్యాంకులు, మూడు ఫిల్టర్ బెడ్‌లు నిర్మించనున్నారు. 535 కి.మీ పాతపైపులైనులు తొలగించి కొత్త పైపులైనులు వేయనున్నారు. రెండో ప్యాకేజీ కింద రూ.42.72 కోట్లు కేటాయించారు. వీటిలో ఒక ఫిల్టర్ బెడ్, 35 కి.మీ పైపులైను నిర్మాణానికి రూ.34.68 కోట్లు, నిర్వహణకు 8.04 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇలా ఒంగోలుకు కేటాయించిన పూర్తి నిధులు తాగునీటి అవసరాల కోసమే వినియోగించనున్నారు. అమృత్-2 కింద రామతీర్థం నుంచి ఒంగోలు వాసులకు తాగునీటిని అందించనున్నారు.

పశ్చిమ ప్రజలకు తీరనున్న నీటి కష్టాలు

పశ్చిమంలోని మార్కాపురం మునిసిపాలిటీకి ప్రభుత్వం రూ.63.14 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో వెలిగొండ ప్రాజెక్టు గొట్టిపడియ సోర్సు ద్వారా మార్కాపురం మునిసిపల్ ప్రాంత ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చనున్నారు. మరోవైపు దర్శి మునిసిపాలిటీలో రూ.130.61 కోట్ల పనులను పబ్లిక్ హెల్త్ అధికారుల ద్వారా చేపట్టనున్నారు. పొదిలి మునిసిపాలిటీకి కేటాయించిన రూ. 126.17 కోట్లను తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఖర్చు చేయనున్నారు.

పంతుళ్లకు పెద్దకష్టం



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పెద్ద కష్టం వచ్చిపడనుందా? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననని సమాధానం ఇస్తున్నాయి. ప్రభుత్వ రంగ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన సన్న బియ్యాన్ని బడులకు తీసుకెళ్లే భారం ఉపాధ్యాయులపైనే పడనుంది. శుక్రవారం మండల విద్యాధికారులు-2తో డీఈవో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పౌరసరఫరాలశాఖ అధికారి మాట్లాడుతూ ఆగస్టు నుంచి పాఠశాలలకు సన్న బియ్యాన్ని టీచర్లే తీసుకెళ్లాల్సి ఉంటుందని బాంబు పేల్చారు. ఈ ప్రతిపాదనపై సమావేశానికి హాజరైన ఎంఈవోలు అభ్యంతరం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టీచర్లు భగ్గుమంటున్నారు.

- సన్నబియ్యం తీసుకెళ్లే బాధ్యత వారిదే!
- అభ్యంతరం తెలిపిన ఎంఈవోలు
- భగ్గుమంటున్న ఉపాధ్యాయ లోకం

ఒంగోలు విద్య, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. జిల్లాలోని 2,500 పాఠశాలల్లో సుమారు 1.81లక్షల మందికి మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. గత ఏడాది వరకు అందుకు అవసరమైన బియ్యాన్ని గ్రామాల్లోని రేషన్ షాపుల ద్వారా పాఠశాలలకు సరఫరా చేసేవారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సన్న బియ్యంతో పెడుతున్నారు. అవి దుర్వినియోగం కాకుండా మండలస్థాయి స్టాక్ పాయింట్ నుంచి డీలర్‌కు సంబంధం లేకుండా నేరుగా పాఠశాలలకు అందిస్తున్నారు. అయితే ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. చిన్నచిన్న పాఠశాలలకు కూడా వాహనం వెళ్లి బియ్యం దించి రావాలంటే దూరాభారమవుతోంది. దీంతో పాఠశాల పాయింట్‌కు తమ వాహనం వెళ్లినప్పుడు అవి మూసివేసి ఉండటంతోపాటు హెచ్‌ఎంలు అందుబాటులో ఉండటం లేదు. ఫలితంగా తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని బియ్యం సరఫరా కాంట్రాక్టర్ జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బియ్యాన్ని క్లస్టర్ పాఠశాలలో దించితే అక్కడి నుంచి టీచర్లు తమ పాఠశాలలకు తీసుకెళ్లాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై ఎంఈవోలు అభ్యంతరం తెలిపారు.

క్లస్టర్ పాయింట్ నుంచి అంటే కష్టమే..

ప్రస్తుతం టీచర్లలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. ఏకోపాధ్యాయ స్కూళ్లు ఉన్నాయి. ఈ టీచర్లు క్లస్టర్ నుంచి బియ్యం తీసుకెళ్లాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. తమను బోధనేతర పనుల నుంచి విముక్తుల్ని చేసి కేవలం చదువుకే పరిమితం చేయాలని ఒకవైపు వేడుకుంటుంటే మరోవైపు కొత్తగా సన్నబియ్యం తీసుకెళ్లే బాధ్యతను నెత్తిన పెట్టడం ఏమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రతిపాదనపై జాయింట్ కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించాలని ఎంఈవోలు నిర్ణయించారు. జిల్లా విద్యాశాఖాధికారితో కలిసి సోమవారం జేసీ వద్దకు వెళ్లాలని భావిస్తున్నారు.


మార్కాపురం ర్యాలీలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల, అధికారులు

ప్లాస్టిక్ నివారణే లక్ష్యం

జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

- మార్కాపురంలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్
- ఇతరచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

ఒంగోలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యమని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉద్ఘాటిం చారు. ప్రజలంతా చైతన్యవంతులై సహరించాలని కోరారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వపరంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలుప్రాంతాల్లో కీలక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ ముఖ్యనేతలు, వివిధ స్థాయిల్లోని అధికారులు పాల్గొన్నారు. ప్రతినెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ఈ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం అనే నినాదంతో ప్రజా చైతన్య కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. ప్రత్యేకించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలు, వాటి నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించింది. తదనుగుణంగా జిల్లావ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కోసం అధికార యంత్రాంగం భారీ ర్యాలీలను నిర్వహించింది. మార్కాపురం పట్టణంలో చేపట్టిన ర్యాలీలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ అన్సారియా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మార్కెట్‌ను సందర్శించి ప్లాస్టిక్ వాడవద్దని వ్యాపారులకు సూచించారు. ఒంగోలులో కార్పొరేషన్ కార్యాలయం నుంచి ట్రంకురోడ్డు మీదుగా అద్దంకి బస్టాండు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్, జేసీ గోపాలకృష్ణ పాల్గొన్నారు. కనిగిరి పట్టణంలోని కొత్తూరు రోడ్డు మార్గంలో ఏళ్లతరబడి డ్రైనేజీ కాలువలో నిలిచిపోయిన మురుగును ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో సిబ్బంది తొలగించారు. అలాగే పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దోర్నాలలో చేపట్టిన ర్యాలీలో టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. పలు ఇతర పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా ర్యాలీలు, మానవహారాలు, ఇతర రూపాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధిద్దాం అంటూ ప్రతిజ్ఞలు చేశారు.


ఒంగోలులో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్

కుంటభూమి అన్యాక్రాంతం

- అక్రమంగా రోడ్డు నిర్మాణం
- చోద్యంచూస్తున్న అధికారులు


కుంట భూమిలో ఏర్పాటు చేసిన రోడ్డు

7

జీజీహెచ్‌ను అభివృద్ధి చేస్తాం

- రోగులకు మెరుగైన సేవలు అందిస్తాం
- మంత్రి డాక్టర్ బాలవీరాంజనేయస్వామి
- మార్కాపురం వైద్యశాలలో ఐసీయూ యూనిట్, థైరాయిడ్ మిషన్లు ప్రారంభం

7

రయ్..రయ్..

రూపురేఖలు మారిన రహదారులు

- వై.పాలెంకు ఏడాదిలో తారు రోడ్ల నిర్మాణానికి రూ.20కోట్లు మంజూరు
- గత వైసీపీ హయాంలో గోతులతో నరకం
- ఇప్పుడు హాయిగా ప్రయాణం


రూ.1.50కోట్లతో నిర్మిస్తున్న మద్దలకట్ట-చాట్లమడ అగ్రహారం రోడ్డు

త్రిపురాంతకం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పనులను గాలి కొదిలేయడంతో గ్రామీణ రోడ్లు దీనావస్థకు చేరాయి. పది కిలోమీటర్ల ప్రయాణానికి కూడా గంట సమయం పడుతూ ప్రయాణికులు నరకం చూశారు. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రమైన ఎర్రగొండపాలెం నుంచి మండల కేంద్రాలను కలిపే రోడ్ల దుస్థితిని చూసి ప్రజలు గత పాలకులపై దుమ్మెత్తి పోశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదిలోనే అనేక రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. గుంతలులేని రోడ్ల పేరుతో కొన్నింటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు జరిగాయి. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేయటమే కాకుండా ప్రధాన రోడ్లను తారురోడ్లుగా మార్చే కార్యక్రమాన్ని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రతిష్టాత్మకంగా తీసుకుని కేవలం తారురోడ్ల కోసమే దాదాపు రూ.20కోట్లు మంజూరు చేయించగలిగారు. ఇప్పటికే త్రిపురాంతకం మండలంలోని టి.చెర్లోపల్లి గ్రామానికి కోటి 40లక్షలతో తారు రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. మిరియంపల్లికి కోటి 40లక్షలు, నడిగడ్డకు కోటి 20లక్షలతో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. ఇవికాక వెల్లంపల్లి బ్రిడ్జి నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలకు ఆ సమస్య పరిష్కారం కోసం 2కోట్ల 6లక్షలు మంజూరయ్యాయి. అక్కడ అప్రోచ్‌రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. పుల్లలచెరువు మండలం మల్లాపాలెంలో రూ.60లక్షలతో తారురోడ్డు, పెద్దారవీడు మండలం మద్దలకట్ట-చాట్లమడకు కోటి 50లక్షలతో తారురోడ్డు, కె.జి.రోడ్డు నుంచి కర్రోలకు రూ.68లక్షలతో తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బి.చెర్లోపల్లి-చట్టమిట్ట రోడ్డుకు కూడా రూ.54లక్షల మేర నిధులు మంజూరయ్యాయి.


రూ.1.20 కోట్లతో నిర్మించిన త్రిపురాంతకం మండలం టి.చెర్లోపల్లి రోడ్డు

ఆర్‌అండ్‌బీ రోడ్లకు నాబార్డు నిధులు

నాబార్డు నిధులతో ప్రస్తుతం ప్రధాన రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇటీవల పుల్లలచెరువు మండలం ఐటీవరం వచ్చిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎర్రగొండపాలెం-పుల్లలచెరువు రోడ్డుకు 2కోట్ల 85లక్షలు మంజూరయ్యాయి. ఎరిక్షన్‌బాబు రెండురోజుల క్రితం పనులను ప్రారంభించగా వేగంగా జరుగుతున్నాయి. ఎర్రగొండపాలెం-త్రిపురాంతకం రోడ్డు దుస్థితి ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో కళ్లకుకట్టినట్టు కనిపిస్తోంది. ఈ రెండు రోడ్లను గత పాలకులు డబుల్‌గా విస్తరిస్తామని చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. ప్రస్తుతం త్రిపురాంతకం రోడ్డు పనులకు రూ.2కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి. ఇవి కాకుండా ఎర్రగొండపాలెం-గంజివారిపల్లి రోడ్డుకోసం 2కోట్ల 5లక్షలు, చాపల మడుగు-దొనకొండ రోడ్డు నిర్మాణం కోసం కోటి 20లక్షలు మంజూరై శంకుస్థాపన జరిగింది. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ చర్యలు తీసుకుంటున్నారు. పుల్లలచెరువు మండలం కవలకుంట్ల వద్ద మురుగుకాలువను తలపించేలా వర్షం సమయంలో వాహనదారులకు ఇబ్బంది పెట్టే ప్రధానరోడ్డులోని గ్రామ పోర్షన్ వరకు రూ.80లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారు. రోడ్ల నిర్మాణం విషయంలో కూటమి ప్రభుత్వం పెట్టిన శ్రద్ధను చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఏడాదిలో ఎంతమార్పు అని ప్రశంసిస్తున్నారు.

అంతా చేర్పులు, మార్పులే!

రైస్ కార్డుల్లో పేర్ల నమోదు కోసం 60వేలకుపైగా దరఖాస్తులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ప్రభుత్వం రెండేళ్ల తర్వాత కొత్త వాటికి, ఇతర నమోదులకు అవకాశం కల్పించడంతో జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో 84,812 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో ప్రస్తుతం ఉన్న కార్డులో అదనంగా పేరు నమోదు కోసం అత్యధికంగా 60,849 దరఖాస్తులు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న కార్డులో పేర్ల తొలగింపు కోసం మరో 1,481 వచ్చాయి. కొత్త రైస్ కార్డులు కోరుతూ 9,687 అందాయి. ఆధార్ నమోదు కోసం 1,125, రైస్ కార్డులో మార్పుల కోసం 593, అడ్రసు మార్పుల కోసం 2,481 దరఖాస్తులు వచ్చాయి. 42 మంది రైస్ కార్డులను సరెండర్ చేశారు. మరో 8,544 మంది కార్డు విభజన కోసం అభ్యర్థన పెట్టుకున్నారు. ఆ దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హులను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం ఆగస్టులో రైస్‌కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు ఇస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా అప్పుడే కార్డుల్లో చేర్పులు మార్పులతోపాటు కొత్త వారికి కూడా స్మార్ట్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

100 అడుగులు వద్దు...
60 అయితే ఓకే..!

● ట్రంక్‌రోడ్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి కోసం రహదారుల విస్తరణలో భాగంగా చేపడుతున్న ట్రంక్‌రోడ్ విస్తరణపై అధికారులు, పాలకులు పునఃపరిశీలన చేయాలని ట్రంక్‌రోడ్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు శనివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం 48 అడుగులు ఉన్న ట్రంక్‌రోడ్‌ను 100 అడుగులు విస్తరించడం ద్వారా తమ పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తులు కోల్పోతామని తెలిపారు. ఇదే విషయమై పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినట్లు చెప్పారు. ట్రంక్‌రోడ్‌ను 100 అడుగులు విస్తరిస్తే 140 దుకాణాలు పూర్తిగా కోల్పోతామని, మరో 20 షాపులు మొండి గోడలకు పరిమితం అవుతాయని పేర్కొన్నారు. అలాగే విస్తరణ చేయడం ద్వారా 254 మంది వ్యాపారులు పూర్తిగా నష్టపోతారని తెలిపారు. ప్రస్తుతం నెల్లూరు, గుంటూరు, విజయవాడ వంటి పెద్ద నగరాలలో కూడా పాతవీధుల్లో వన్‌వే ట్రాఫిక్ నడుస్తుందన్నారు. తమ న్యాయమైన సమస్యను అర్థం చేసుకుని ట్రంక్‌రోడ్‌ను 60 అడుగులు విస్తరిస్తే అందరికీ ఆమోదమే అని తెలిపారు. అలా కాని పక్షంలో ఎలాంటి నిబంధనలు లేకుండా పాత కూరగాయల మార్కెట్ స్థలం, బాపూజీ మార్కెట్ ఎదురుగల మునిసిపల్ స్థలం, అద్దంకి బస్టాండ్‌లోని అన్నక్యాంటీన్‌కు కేటాయించిన వెనుక స్థలం, నెల్లూరు బస్టాండ్‌లోని మునిసిపల్ హైస్కూలు వద్ద స్థలాన్ని కేటాయించాలని, అలాగే షాపులు కూడా కార్పొరేషన్ అధికారులే నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కూరపాటి సత్యనారాయణ, కార్యదర్శి దేవతు వినోద్‌కుమార్, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

● ఏడో రోజుకు చేరుకున్న సమ్మె



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె శనివారం ఏడవ రోజుకు చేరుకుంది. ఈ మేరకు తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలంటూ కార్మికులు నగరంలో అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ మీదుగా ప్రదర్శన నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు తమ వేతనాన్ని కోల్పోయి గత ఏడు రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి రాకముందు టీడీపీ నాయకులు తమకు అండగా ఉంటామని హామీలు ఇచ్చారని, కాని ఇప్పుడు కార్మికుల సమస్యలను పెడచెవిన పెట్టారని ధ్వజమెత్తారు. కార్మికులకు ఆప్కాస్ కోడ్ లింక్ పెట్టి ప్రభుత్వ ఉద్యోగాలు పేరుతో సంక్షేమ పథకాలను కూడా దూరం చేశారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వేతనాలతో కనీసం కుటుంబం సంతోషంగా గడిపే పరిస్థితి లేదని, తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్, జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, కె.సామ్రాజ్యం, కుమారి, నరసింహం, బాబు, రవి, అబ్రహం, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు మోపేందుకే స్మార్ట్‌మీటర్లు

వాటిని ఉపసంహరించుకోవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురి డిమాండ్



మాట్లాడుతున్న కొండారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారాలు మోపేందుకే ప్రభుత్వం స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగిస్తుందని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్.సాయి, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి సీహెచ్.పద్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాకముందు వివిధ వర్గాల ప్రజలకు 176 వాగ్దానాలు చేసిందన్నారు. వాటిల్లో విద్యుత్ బిల్లుల భారాలు తగ్గింపుతో పాటు పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక అమలు చేయడంతో విఫలమయ్యారని ఆరోపించారు. ఎంఎస్‌సాయి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై వేల కోట్ల భారం మోపుతుందని మండిపడ్డారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ నేటి విద్యాశాఖ మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లను పగులకొట్టాలని పిలుపునిచ్చి ఇప్పుడు వారే బలవంతంగా బిగిస్తున్నారని విమర్శించారు. సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలో భగత్‌సింగ్‌కాలనీలో మీటర్ల ఏర్పాటును అడ్డుకున్నట్లు చెప్పారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ విస్తృతంగా పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఎస్.లలితకుమారి, దామా శ్రీనివాసులు, వి.బాలకోటయ్య, జె.జయంతిబాబు, జి.రమేష్, విజయసారథి, బి.రఘురాం, సుల్తాన్‌బాషా, కె.రమాదేవి, కె.హనుమంతరావు, పి.కల్పన, దాసరి సుందరం, ఎల్.రాజశేఖర్, అయ్యపరెడ్డి, వీరస్వామి, మున్వర్‌బాషా, చుంచు శేషయ్య, జి.శేషయ్య, సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ప్రపంచంపై అవగాహన

సంతనూతలపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మద్దులూరు బస్టాండ్ వద్ద ప్లాస్టిక్ రహిత ప్రపంచంపై రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు శనివారం అవగాహన కల్పించారు. పర్యావరణానికి హానిచేసే ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని కోరారు. అనంతరం రోడ్లపైఉన్న ప్లాస్టిక్ వస్తువులను సీఐ శ్రీకాంత్ బాబు, ఎస్ఐ వి.అజయ్‌బాబు, సిబ్బందితో కలిసి తొలగించారు. అనంతరం స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు.



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ శ్రీకాంత్‌బాబు

గుంతల దారికి మోక్షమెప్పుడో?

అధ్వానంగా నాగిరెడ్డిపాలెం - చెరుకూరు రోడ్డు ● గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోని వైనం ● ఇబ్బందిపడుతున్న వాహనదారులు

పొన్నలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపాలెం నుంచి చెరుకూరు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలకు నరకం చూపిస్తోంది. మండలంలోని ఓవీరోడ్డులో నాగిరెడ్డిపాలెం నుంచి పైరెడ్డిపాలెం, పెరికపాలెం మీదుగా చెరుకూరు వరకు 5.2 కిలో మీటర్ల దూరం ఉంది. అప్పటిదాకా ఉన్న మట్టి రోడ్డును పన్నెండేళ్ల క్రితం సుమారు 3 కోట్ల రూపాయలతో బీటీరోడ్డుగా మార్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డుమొత్తం దారుణంగా తయారైంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతోపాటు మార్జిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రతి మలుపు వద్ద రోడ్డు ఛిద్రంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, గుంతలు, మార్జిన్లలో నీళ్లనిలబడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు గురించి పట్టించుకున్న పాపానపోలేదు. రోడ్డుపై ఎక్కడా తట్టమట్టి వెయ్యలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పెద్దవిగా మారాయి. నాలుగైదు గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు చుక్కలు చూపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రోడ్డు సమస్యపై మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి దృష్టికి స్థానిక నేతలు తీసుకువెళ్లగా త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి పంచాయతీరాజ్ ఏఈ హనుమంతరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, మంత్రి ఆదేశాలతో కొత్తగా బీటీరోడ్డు నిర్మించేందుకు రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి పంపినట్టు తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు.



గుంతలమయంగా మారిన రోడ్డు

1 నుంచి ఒంగోలులో ప్లాస్టిక్ నిషేధం

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ● మన ఆరోగ్యం మనచేతుల్లోనే.. : ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్

ప్లాస్టిక్ నిర్మూలనపై కార్పొరేషన్ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ ● హాజరైన జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు కార్పొరేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం, ప్రమాదకరమైన ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపుతో శనివారం ఒంగోలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేషన్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు భారీ అవగాహన ర్యాలీని నిర్వహించగా, ముఖ్య అతిథులుగా హాజరైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి నగరంలో ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ప్రజారోగ్యం కోసం అందరూ సహకరించాలని, మార్పు మన వద్ద నుంచే మొదలవ్వాలని కోరారు. సమాజ శ్రేయస్సు కోసం సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. పేపర్ ప్లేట్స్, నేత సంచులనే వినియోగించాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ మన ఆరోగ్యం మనచేతుల్లోనే ఉందన్నారు. ఇటీవల కాలంలో ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని, ప్లాస్టిక్ కవర్లు పడేయడం ద్వారా జంతువులు తిని చనిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మురుగునీటి పారుదల వ్యవస్థకు అడ్డంకిగా మారుతున్నాయని చెప్పారు. అదేవిధంగా ప్లాస్టిక్ తయారీ, క్రయ, విక్రయాలను పూర్తి నిషేధించాలన్నారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వల్ల కలిగే ప్రమాదాన్ని ప్రతి ఒక్కరికీ వివరించాలని, జూట్ బ్యాగులు ఉపయోగించుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడే ప్రతి ఒక్కరి ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని తెలిపారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శానిటేషన్, సచివాలయ సెక్రటరీల ద్వారా నగరంలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు ఉంటే పెనాల్టీ విధిస్తామని, ఆ తర్వాత కూడా నిబంధనలు పాటించకుంటే శాఖపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ రహిత నగరంగా ఒంగోలు నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి మాట్లాడుతూ ప్లాస్టిక్ లేని నగరంగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా అందరూ సహకరించలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ పి.శ్రీహరి, కార్పొరేటర్లు, అధికారులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సమ్మెకాలంలో కూడా విధులకు హాజరవుతూ పారిశుధ్య పనులు చేపడుతున్న వారిని ఎమ్మెల్యేలు అభినందించి ఘనంగా సత్కరించారు.



పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, జేసీ గోపాలకృష్ణ, కమిషనర్ వెంకటేశ్వరరావు

కూటమి సుపరిపాలనలో ప్రజలంతా సుభిక్షం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందని, దీంతో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి పేర్నమిట్ట 39వ డివిజన్ పీర్లమాన్యంలో ఇంటింటికి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. కరపత్రాలను ప్రజలకు అందజేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తోందన్నారు. అనంతరం టీడీపీ నాయకులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, నాయకులు ఆరికట్ల సుమతి, చంద్రశేఖర్, చిన్నారావు, ఈశ్వరరావు, చంద్రశేఖర్, మహేష్, మస్తానమ్మ, అమానుల్లా, వెంకటేష్‌రెడ్డి, ఎం.శ్రీను పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మద్దిపాడులో తొలిఅడుగు..

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని నవులూరు శివకృష్ణ అన్నారు. శనివారం మద్దిపాడు ఇందిరమ్మకాలనీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చుంచు హరిబాబు, షేక్ దౌలత్, కంచర్ల కృష్ణ, పొదిలి రాంబాబు, బత్తుల రాజు, సాయికుమార్ పాల్గొన్నారు.

పర్యావరణం కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి

● ఉత్సాహంగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

పొన్నలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పలువురు వక్తలు సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ గిరిజన ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం'.. 'రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా మార్చుకుందాం' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. బోగనంపాడులో ర్యాలీ అనంతరం సచివాలయం వద్ద గ్రామస్థులు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో పి.సుజాత మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పేపర్, జూట్ సంచులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగేశ్వరరావు, ఏవో రాము, ఎంపీటీసీ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బోగనంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్థులు

సింగరాయకొండలో..

సింగరాయకొండ: ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని ఎంపీడీవో జయమణి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల చేత ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆర్.రమేష్‌బాబు, ఏఈ పి.రమేష్‌బాబు, మండల కోఆర్డినేటర్ సుధాకర్, సచివాల య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎల్‌పురంలో..

చీమకుర్తి: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను శనివారం చీమకుర్తి మండలంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఆర్ఎల్‌పురంలో డీఎల్‌పీవో పద్మ సమక్షంలో మానవహారం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో రాఘవేంద్ర, అధికారులు పాల్గొన్నారు. చీమకుర్తి పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణయ్య, టీడీపీ నాయకులు వై.రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, సూరంపల్లి హనుమంతరావు, కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సింగరాయకొండలో పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో జయమణి



ఆర్ఎల్‌పురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్థులు

పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షునికి సన్మానం

మద్దిపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పెద్దకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు మండవ హరిప్రసాద్‌ను శనివారం ఏడుగుండ్లపాడులో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిప్రసాద్ తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలందించారన్నారు. అందుకు గుర్తింపుగా సొసైటీ అధ్యక్షునిగా ఎంపిక చేయటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న నాగేశ్వరరావు

మోటార్ సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం రాత్రి మద్దిపాడులోని పచ్చళ్ల కంపెనీ సమీపంలో జరిగింది. మేదరమెట్లకు చెందిన ఆర్.శ్రీనివాసరావు మద్దిపాడు నుంచి మోటార్‌సైకిల్ వెళుతుండగా ఎదురుగా టర్బో లారీ రావడంతో కంగారు పడి డివైడర్‌ను ఎక్కించాడు. దీంతో అతని తలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం మేదరమెట్లకు తరలించారు.

వనం-మనం కమిటీ సభ్యుడిగా వీరభద్రాచారి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వనం-మనం కమిటీ సభ్యుడుగా వలంటీర్ ఎన్విరాన్‌మెంట్ ఆర్గనైజేషన్ చైర్మన్ జి.వీరభద్రాచారి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అటవీశాఖ అధికారి కె.రాజశేఖరరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉండే ఈ కమిటీలో పర్యావరణ పరిరక్షణ సంస్థ (ఎన్‌జీవో) కోటాలో వీరభద్రాచారిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు, అటవీశాఖ అధికారి రాజశేఖరరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

14మంది ఏఎన్‌ఎంలు బదిలీ

మద్దిపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు ఆరోగ్యకేంద్రం పరిధిలో పనిచేస్తున్న 14 మంది ఏఎన్‌ఎంలు శనివారం బదిలీపై వెళ్లారని డాక్టర్ ఆనంద్‌మోహన్ తెలిపారు. ఏడుగురు బదిలీపై ఇక్కడకు వచ్చారని, మిగతా ఏఎన్‌ఎంలు సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

మద్దిపాడులో ఒక మోస్తరు వర్షం

మద్దిపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో శనివారం సాయంత్రం ఒక మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వర్షం పంటలకు అనుకూలంగా ఉంటుందని, పొలాలను సేద్యం చేసి శనగ పంట సాగు చేసుకోవచ్చని వారు భావిస్తున్నారు.

నేడు కూడా ధ్రువీకరణపత్రాల పరిశీలన

సంతనూతలపాడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): డీఈఈసెట్-2025కు ఎంపికైన విద్యార్థులకు ఆదివారం కూడా కౌన్సిలింగ్ నిర్వహించి యథావిధిగా ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సీట్లు కేటాయిస్తామని మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సోమాసుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఈఈసెట్‌కు ఎంపికైన అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా రామారావు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా బొట్లా రామారావును నియమిస్తూ శనివారం ఆ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్‌కే నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీమంత్రి ఆదిమూలపు సురేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గౌతమ్ స్కూలులో ఘనంగా రెడ్ డే

ఒంగోలు విద్య, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం భాగ్యనగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూలులో శనివారం రెడ్‌కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు ఎరుపు రంగును పరిచయం చేసేందుకు యాపిల్, రోజ్ ఫ్లవర్‌లు, టమోటాలు, ఇతర వస్తువులు చూపించి వారితో గుర్తింపజేశారు. విద్యార్థులు, టీచర్లు ఎరుపు రంగు దుస్తులు ధరించారు. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మ, అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

దళితులపై దాడులు ఆగడం లేదు

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ఒంగోలు క్రైం, జూలై19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై దాడులు ఆగడం లేదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. శనివారం ఒంగోలులోని ఎంసీపీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టులో దళిత న్యాయవాదులపై దాడిని ఖండిస్తున్నామని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్లు నిధులు లేని సంస్థలుగా మిగిలిపోయాయని అన్నారు. రాష్ట్ర రాజధాని ఒంగోలు దగ్గర దొనకొండలో నిర్మించాలని శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సు చేసిందని, అక్కడ ప్రభుత్వ భూమి లక్ష ఎకరాలు ఉందని తెలిపారు. కానీ చంద్రబాబు రాజధానిని అమరావతి తీసుకెళ్లారని ఆరోపించారు. సమావేశంలో విజేంద్రబహుజన్ పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాల అవకతవకలపై విచారణ

పామూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పామూరులో శనివారం శ్రీనిధి రుణాల మంజూరులో జరిగిన అవకతవకలపై కలెక్టర్ ఆదేశాలపై జిల్లా ఇన్‌చార్జి ఏపీడీ కె.లక్ష్మీరెడ్డి, శ్రీనిధి ఏజీఎం ఉదయ్‌కుమార్ విచారణ చేశారు. 2013లో పనిచేసిన అప్పటి అధికారులు, సీసీలపై వీవోఏ పల్లపు బేబి గతనెల 14న కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఐదు గ్రూపులకు సంబంధించి రూ.16.50 లక్షలు సీసీఎల్ రుణాలను ఎన్‌పీగా ఉన్న గ్రూపులకు బదలాయించారని, అందులో తన పాత్ర లేదని, విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో విచారణ చేశారు. 2013 నుంచి శ్రీనిధి రుణాలకు సంబంధించి బ్యాంకు స్టేట్‌మెంట్ల ప్రకారం విచారిస్తున్నట్టు తెలిపారు.



సైకిల్‌పై తిరుగుతూ అద్దంకిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో యువకులతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

సైకిల్‌పై సార్ గస్తీ

అర్ధరాత్రి అద్దంకిలో సీఐ నిరంతర పరిశీలన

అసాంఘిక కార్యకలాపాలు, యువకుల హల్‌చల్‌కు అడ్డుకట్ట



పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒంగోలులో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎస్పీ దామోదర్ శనివారం తన నివాసం నుంచి సైకిల్‌పై సవారీ చేశారు.

రాత్రి 12 గంటలు అవుతోంది. బస్టాండ్‌లో బస్సు దిగాల్సిన ఓ మహిళ పొరపాటున అద్దంకిలోని భవానీ సెంటర్‌లో దిగింది. అర్ధరాత్రి కావడంతో ఇంటికి పోవడానికి ఆటోలు కూడా అందుబాటులో లేవు. లారీలు నిలిచి ఉండడంతో మద్యం సేవించిన మందుబాబులు కూడా ఆ ప్రాంతంలో సంచరిస్తుండడంతో ఆ మహిళ బిక్కుబిక్కుమంటోంది. ఇంతలో నడి వయస్సు ఉన్న వ్యక్తి సైకిల్‌పై వచ్చారు. ఆమె సమస్యను అడిగారు. తాను ఇంటికి పోవడానికి ఏ వాహనం లేదని చెప్పడంతో క్షణంలో ఓ పోలీసు వాహనం అక్కడకు వచ్చింది. ఆ మహిళను నేరుగా సాయిబాబా గుడి సమీపాన ఇంటి వద్ద దించేయమని ఆ వ్యక్తి చెప్పడంతో వాహనంలోని పోలీసులు నేరుగా ఆమెను వారి ఇంటి వద్ద సురక్షితంగా దించారు. సీన్ కట్‌చేస్తే ఆ మహిళ వద్దకు సైకిల్‌పై వచ్చిన వ్యక్తే సీఐ సుబ్బరాజు. గత ఫిబ్రవరి నుంచి ఆయన సైకిల్‌పై అర్ధరాత్రి తిరుగుతున్నారు. నెల కిత్రం ఒక కుటుంబం ఇదే విధంగా ఇబ్బంది పడడంతో పోలీసు వాహనంలో వారిని బస్టాండ్‌కు చేరారు.

అద్దంకి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పోలీసులు నైట్‌బీట్‌లు తిరుగుతున్నారంటే సుమారు రెండు, మూడు వందల మీటర్ల దూరం నుంచే సైరన్ వినిపిస్తుంది. దీంతో అల్లరి మూకలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు ముందుగానే జాగ్రత్త పడుతుంటారు. అదే సమయంలో బీట్‌లు తిరిగే పోలీస్ సిబ్బంది సైతం విధులలో మొక్కుబడిగానే ఉంటుంటారు. ఈ క్రమంలో వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు అద్దంకి సీఐ ఆరాధ్యుల సుబ్బరాజు సైకిల్ సవారీకి శ్రీకారం చుట్టారు. రాత్రి సమయంలో అద్దంకి పట్టణంలో తానే సైకిల్‌పై తిరుగుతూ ప్రత్యేక నిఘా పెడుతున్నారు. రాత్రి 11 గంటల నుంచి ప్రారంభించి వేకువజామున సుమారు 2 గంటల వరకు పట్టణంలో సైకిల్‌పై తిరుగుతున్నారు. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్, భవానీసెంటర్, గాంధీబొమ్మసెంటర్, ప్రభుత్వ వైద్యశాల రోడ్డు, కాకానిపాలెం, అభ్యుదయనగర్, వాసవినగర్, రామ్‌నగర్ ప్రాంతాలకు ప్రధాన రోడ్ల వెంబడే కాకుండా అంతర్గత రోడ్లలో కూడా సైకిల్‌పై తిరుగుతూ పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలపై రాత్రి సమయంలో నిఘాకు అవకాశం లభిస్తోంది. అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే పిలిచి మాట్లాడడంతో పాటు ఏ పనిమీద వచ్చారో తెలుసుకొని రోడ్లపై కాకుండా ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉండే విధంగా తగు సూచనలు చేస్తున్నారు. ఎవరైనా అనుమానస్పదంగా ఉంటే వాళ్ల వద్ద ఉన్న ఆధారాలను కూడా పరిశీలిస్తున్నారు. సివిల్ డ్రెస్‌లో సైకిల్‌పై ఉండడంతో కొంత మంది నిర్లక్ష్యం సమాధానం చెప్తున్న సందర్భాలు ఉంటున్నాయి. ప్రధానంగా లారీలు అద్దంకిలో టీ దుకాణాల వద్ద పార్కింగ్ చేయడం, బెల్ట్‌షాపులు తీసి ఉండడాన్ని గమనించి కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు.

● ప్రత్యేక నిఘా పెట్టేందుకు వీలు

అద్దంకి పట్టణంపై రాత్రి సమయంలో ప్రత్యేక నిఘా పెట్టేందుకు సైకిల్‌పై తిరగడం ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. సైకిల్‌పై వెళ్తుండటంతో ఎవరూ గుర్తించకుండా వాళ్ల పనులలో నిమగ్నమై ఉంటున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వాళ్లను సులువుగా గుర్తించే అవకాశం ఉంది. సిబ్బంది విధులపై ప్రత్యేకంగా పర్యవేక్షణకు అవకాశం ఏర్పడింది.

- సుబ్బరాజు, సీఐ, అద్దంకి టౌన్

96 పనులకు రూ.13.35 కోట్లు మంజూరు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 96 పనులకు రూ.13.35 కోట్ల పనులకు ఆమోదం తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో శనివారం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ సమావే శం జరిగింది. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఒంగోలు కార్పొరేషన్, మార్కాపురం, అద్దంకి, చీరాల, కనిగిరి మునిసిపాలిటీలు, చీమకుర్తి, దర్శి, పొదిలి, గిద్దలూరు నగర పంచాయతీల నుంచి వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులను మురుగు కాలువల నిర్మాణం, వరద కాలువల నిర్మాణాలకు ప్రతిపాదించారు. ఆయా మునిసిపాలిటీల ద్వారా టెండర్లు పిలిచి మూడు నెలల్లో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జేసీ గోపాలకృష్ణ అదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తరుణ భాస్కర్, బాబురావు, శ్రీనివాససంజయ్, చండిదేవసేన, కేవీ పద్మావతి ఉన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వినియోగదారులకు భారం కాదు

● ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వినయోగదారులపై ఎలాంటి అదనపు భారం పడదని విద్యుత్తు శాఖ యస్ఈ కట్టా వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న మీటర్లులాంటివే స్మార్టు మీటర్లు అనీ, అదనంగా సమాచార మార్పిడి సదుపాయం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో రీడింగ్ తీస్తారని తద్వార కచ్చితమైన తేదీలలో రీడింగ్ తీసే అవకాశం ఉందని వివరించారు. ప్రీపెయిడ్ విధానం ప్రస్తుతం లేదని టారిఫ్ అంతా ఒకే విధంగా ఉంటదని తెలిపారు.

25లోపు పేర్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని న్యాక్ శిక్షణా కేంద్రంలో అసిస్టెంట్ ఎలక్టిషిన్, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 25వ తేదీలోపు పేర్లు రిజస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత, ఫెయిల్ అయిన నిరుద్యోగయువకులకు ఉచితంగా ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచిశిక్షణ ప్రారంభమవుతుందని, ఇతర వివరాలకు 78298 98116 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

నగరంపై నిఘా నేత్రం

● డ్రోన్ కెమేరాలతో పరిశీలన



ఒంగోలు క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నేరనియంత్రణ, చట్ట వ్యతిరేక కార్యకలపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమోరాలను వినయోగిస్తున్నట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. శనివారం సాయత్రం నగరంలో 35 డ్రోన్లను ఎగురవేసి అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు చర్యలు తీసుకుటున్నామని చెప్పారు. బైక్ రైడర్లు, చైన్ స్నాచర్లపై నిఘా ఉంచామని అన్నారు. బహిరగంగా మద్యం సేవించే వారిపై దృష్టి సారించి చర్యలు తీసుకున్నామని అన్నారు. నిత్యం నగరంలో డ్రోన్ కెమోరాలతో నిఘా ఉంటుదని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో పోస్టల్ ఉద్యోగి మృతి

● ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదం

● స్వర్ణ - చీరాల రోడ్డులో ఘటన

తిమిడితపాడు/పర్చూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో పోస్టల్ ఉద్యోగి మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున కారంచేడు మండలం స్వర్ణ - చీరాల రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తిమిడితపాడు గ్రామానికి చెందిన పాడిబండ్ల కృష్ణ(35) తిమిడితపాడులో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్(ఏబీపీఎం)గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు తన భార్య అశ్విని, అత్తను తిరుపతి పంపించేందుకు చీరాల వెళ్లి ట్రైన్ ఎక్కించి తన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యాడు. స్వర్ణ రోడ్డులో టపాసుల గోడౌన్ సమీపంలో రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడు. అయితే గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడా లేక మరి ఏమైన కారణం ఉందా..? అన్న కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు. మృతినికి భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. సమాచారం అందుకున్న కారంచేడు ఎస్సై తన సిబ్బందితో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుంటభూమి అన్యాక్రాంతం

● అక్రమంగా రోడ్డు నిర్మాణం

● చోద్యంచూస్తున్న అధికారులు

కోట్లాది రూపాయల విలువచేసే కుంటభూమి అన్యాక్రాంతమవుతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడు. కొంతమంది అక్రమార్కులు ఆ భూమిని స్వాహా చేసేందుకు ఎంతోకాలంగా రకరకాల ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కొంతమంది ఎగువ పొలాలకు రోడ్డు పేరుతో కుంటభూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రోడ్డు నిర్మించుకున్నారు. విచిత్రంగా కుంటకట్ట మట్టిని తవ్వి రోడ్డుకు పోసుకున్నా ఇదేమిటని అడిగేవారేలేరు. సంబంధిత అధికారులు ఏకారణం చేతనో మౌనం వహిస్తున్నారు. జరుగుతున్న తంతు చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

దర్శి, జూలై 19(ఆంధ్రజ్యోతి): దర్శి-పొదిలి రోడ్డులోని దర్శి రెవెన్యూలోని 1071 సర్వేనెంబర్‌లో 6.5 ఎకరాలు కుంటభూమి ఉంది. ఈ భూమి దర్శి-పొదిలి మెయిన్ రోడ్డు ఆనుకొని ఉండటంతో ఎకరం కోటి రూపాయలు ధర పలుకుంది. దీంతో అక్రమార్కులు అనేకమందికి ఈ భూమిపై కన్నుపడింది. గత కొన్ని సంవత్సరాలుగా కుంట భూమిని స్వాహా చేసేందుకు అనేకమంది ప్రయత్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది ఈ భూమిపై తమకు హక్కులు ఉన్నాయని నకిలీ పట్టాలు సృష్టించి స్వాహా చేసే ప్రయత్నం చేశారు. మరికొంత మంది తాము ఎంతోకాలంగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నామని, తమకు హక్కులు కల్పించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు.

కుంటభూమి అన్యాక్రాంతం కాకుండా ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించటంతో అప్పటి వైసీపీ నాయకులు ఎంత ప్రయత్నించినా వారి ప్రయత్నాలు ఫలించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములకు రక్షణ ఏర్పడుతుందని అందరూ భావించారు. అయితే కొంతమంది అక్రమార్కులు ఇప్పుడు కూడా ప్రభుత్వ భూములపై కన్నేసి స్వాహా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులోభాగంగా ఈ కుంటభూమిని స్వాహా చేసేందుకు ఎగువ పొలాలకు రోడ్డు పేరుతో మూడు రోజుల క్రితం ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల ద్వారా రోడ్డు నిర్మాణం చేపట్టారు. అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్నట్టు తెలిసినా గురువారం సాయంత్రం వరకు అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో కుంట కట్టమట్టిని తవ్వి మరీ రోడ్డును నిర్మంచుకున్నారు.

కుంటభూమిలో కొంతబాగాన్ని కొంతమంది సాగు చేసుకుంటున్నారని ప్రస్తుతం రోడ్డు వేసిన అక్రమార్కులు వారితో కుమ్మకై కుంటభూమిని స్వాహా చేసేందుకు పథకం రచించుకున్నట్లు తెలిసింది. అక్రమార్కులు ఎగువన ఉన్న తమ స్వంత భూమిని ఆనుకొని ఉన్న కుంటభూమిని కలుపుకొని ప్లాట్లు వేసి విక్రయించాలనే ఆలోచనలతో అక్రమంగా రోడ్డు నిర్మించినట్లు ప్రజలు చెప్పుకుంటున్నారు. బహిరంగంగా పట్టపగలు అక్రమార్కులు కుంటభూమిలో నిబంధనలకు విరుద్ధంగా కట్ట మట్టి త్రవ్వి రోడ్డు నిర్మించినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇక్కడ జరుగుతున్న తంతును గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నేర రహిత సమాజం కోసం పాటుపడాలి

● పోలీసు, న్యాయవ్యవస్థల సమన్వయం కీలకం

● అర్ధ సంవత్సర నేర సమీక్ష సమావేశంలో జిల్లా న్యాయాధికారి భారతి



మాట్లాడుతున్న న్యాయాధికారి భారతి

ఒంగోలు క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో పోలీసులు, న్యాయవ్యవస్థ సమన్వయం కీలకమని జిల్లా జడ్జి ఏ.భారతి పేర్కొన్నారు. ఒంగోలు నగరం శివారు ప్రాతంలో రైస్ ఇంజినీరింగ్ కాలేజీ కాన్ఫరెన్స్ హల్‌లో ఆర్ధసంత్సర నేర సమీక్ష సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమాని ఎస్పీ ఏఆర్ .దామోదర్ నిర్వహించారు. జిల్లా న్యాయాధికారి భారతి మాట్లాడుతూ పోలీసులు నమోదు చేసే కేసుల నాణ్యత, సాక్షాధారాల సేకరణపై తీర్పులు ఉంటాయిని అన్నారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు పోలీసు, కోర్టు మధ్య సమన్వయ సమావేశాలు జరగాలన్నారు. నేరరహిత సమాజం కోసం ప్రతిఒక్కరు భాధ్యతగా వ్యహరించాలని కోరారు. ఎస్పీ ఏఆర్.దామోటదార్ మాట్లాడుతూ గడిచిన ఆరునెలలో పోలీసుల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు.

జీజీహెచ్‌ను అభివృద్ధి చేస్తాం

రోగులకు మెరుగైన సేవలు అందిస్తాం

మంత్రి బాలవీరాంజనేయ స్వామి

మార్కాపురం వైద్యశాలలో ఐసీయూ యూనిట్, థైరాయిడ్ మిషన్లు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

మార్కాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలను మరింత అభివృద్ధి చేసి రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 10 బెడ్ల ఐసీయూ వార్డును, థైరాయిడ్ మిషన్లను మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే నారాయణరెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అందులో భాగంగానే మూల నపడిన ఐసీయూపై ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవతో దాతల సహకారంతో పునఃప్రారంభిం చామన్నారు. వైద్య సేవల అవసరాన్ని గుర్తించి అందుకు తగిన విధంగా డిప్యుటేష న్‌పై వైద్యులను నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంద న్నారు. రెండో ఆపరేషన్ థియేట ర్‌కు వారం రోజుల్లోగా ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆక్సిజ న్ ప్లాంట్, జనరేటర్లు బాగా పనిచే సేలా మరమ్మతులు చేయిస్తామ న్నారు. ఈ సందర్భంగా ఐసీయూ విభాగానికి గతంలో ఎక్కువ మొత్తంలో ఆర్థిక సహాయం చేసిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కాటం అరుణమ్మ దంపతు లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, వైద్యశాల సూప రింటెండెంట్ రామచంద్రరావు, మునిసిపల్ కమి షనర్ డీవీఎస్ నారాయణరావు, తహసీల్దార్ చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామికుల అరెస్టులు హక్కులకు భంగం కలిగించడమే

● రిటైర్డ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో పీడిత కులాల ప్రజల కోసం గొంతు విప్పుతున్న ఉద్యమకారులను, ప్రజాస్వామిక వాదులను అక్రమంగా అరెస్టులు చేయడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు భంగం కలిగించడమేనని జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌ను విడుదల చేయాలని ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రశ్నించే హక్కు, మాట్లాడే హక్కు, జీవించే హక్కు రాజ్యాంగంలో పొందుపరిస్తే వాటిని కాలరాసే హక్కు ఎవరికీ లేదన్నారు. ఉమ్మడి హైకోర్టు మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ సత్యప్రసాద్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో ఉన్న నల్ల చట్టాలను ఈ దేశంలో ఉన్న పౌరులపై, ప్రజాస్వామిక వాదులపై ప్రయోగించడం దుర్మార్గమన్నారు. వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ దేశంలో ఉన్న సహజ వనరులను, సంపదను కార్పొరేట్‌లకు అప్పజెప్పడానికి చత్తీస్‌ఘడ్‌లో ఉన్న ఆదివాసీలపై అత్యాచాలు, హత్యలు, చేసి అడవి నుంచి ఆదివాసీలను ఖాళీ చేయించాలని, అడవిని కార్పొరేట్‌లకు అప్పజెప్పే కుట్రలో భాగంగానే ఆపరేషన్ ఖగార్ పేరుతో హింసనను మొదలు పెట్టి ఈ దేశంలో ఉన్న పౌరులపైనే యుద్ధం చేస్తున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ ప్రతిపక్ష పార్టీలను అర్బన్ నక్సలైట్స్‌గా వాఖ్యానిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని అన్నారు. సభకు రాష్ట్ర సహాయకార్యదర్శి దుడ్డు వెంకట్రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య అధ్యక్షత వహించారు. సభలో విరసం రాష్ట్ర అధ్యక్షుడు జి.కళ్యాణ్‌రావు, న్యూ డెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, చేనేత కార్మిక సంఘ రాష్ట్ర నాయకులు మాచర్ల మోహన్‌రావు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న స్వచ్ఛ లక్ష్యం

- ప్రకటనలు, ర్యాలీలకే పరిమితమైన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు
- ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే
- పాలిథిన్ కవర్ల కుప్పలు.. పందులకు ఆవాసాలు

కంభం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెలా 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, ప్లాస్టిక్ వాడకం వద్దు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీలు చేయడం, ప్రకటనలు ఇవ్వడం వరకే పరిమితమవుతుంది. ఆచరణలో చెత్త ఏరివేత, పరిశుభ్రత, పారిశుధ్య చర్యలు, ప్లాస్టిక్ నిషేధాజ్ఞలు అమలవుతున్న దాఖలాలు లేవు. ఎక్కడ చూసినా కుప్పలు తెలప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు, పాలిథిన్ కవర్లు కన్పిస్తున్నాయి. దీంతో అటువైపు వెళ్లే వాహనదారులు, ప్రజలు కంపుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆ చెత్తకుప్పలు దోమలు, ఈగలు, పందులకు ఆవాసకేంద్రాలుగా మారుతున్నాయి. మండల, జిల్లా స్థాయి అధికారులు హోల్‌సేల్, చిరు, చిల్లర దుకాణాలు ఆకస్మిక దాడులు చేసి ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు విక్రయించే వారిని హెచ్చరించడం గాని, చర్యలు తీసుకున్న ఘటనలు లేవు. కవర్లు వాడి పడవేయడం వలన అవి భూమిలో నిలువ ఉండి భూమిలోకి నీటిని ఇంకింప చేయవని,



కంభం ఆర్టీసీ బస్టాండ్ ముందు ఇరిగేషన్ పంట కాలువ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు



అరాఫత్ నగర్‌కు వెళ్లే దారిలో పంట కాలువలో, గట్టుపై పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

అవి హానికరమని, ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. కంభంలో సుమారు 20 కిలో మీటర్ల మేర ఇరిగేషన్ కాలువలు ఉండగా అదాంతా ప్లాస్టిక్ వ్యర్థాలతో పూర్తిగా నిండిపోయింది. దీంతో చెరువులో నీరు ఉండి పంట కాలువలకు నీరు వదిలినా వెళ్లే మార్గం లేక పొలాల్లో నీరు అందక బీళ్లుగా మారాయి. అదే విధంగా పందులకు ఆవాసాలుగా మారాయి. ఇప్పటికైనా అధికారులు అటు వ్యాపారుల్లో, ఇటు ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అప్పులే స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లక్ష్యం నెరవేరుతుంది.

లక్ష్యాలు ఘనం... అమలు శూన్యం

- ఫొటోలు, ఫోజులకే పరిమితమైన అధికారులు
- నీరుగారుతున్న కార్యక్రమాలు

పెద్దారవీడు : ప్రభుత్వ లక్ష్యాలు ఘనంగా ఉన్నా అధికారుల వ్యవహారశైలితో వాటి అమలు, లక్ష్య సాధన శూన్యంగా మారాయి. అధికారులు కేవలం ఫొటోలకు ఫోజులిచ్చి అద్భుతంగా నిర్వహించామని ఆన్‌లైన్‌సర్వర్లలో అప్‌లోడ్ చేయడం తప్ప అమలు చేయడం లేదు.

ప్లాస్టిక్‌పై నిషేధ కార్యక్రమం జరిగిందిలా

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించాలని, వాటి ఉపయోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను ప్రజలకు తెలియజేయాలని శనివారం మండలంలోని అన్నీ గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కార్యక్రమంలో భాగంగా అధికారులందరూ మండల కేంద్రమైన పెద్దారవీడు ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వ నిర్దేశించిన విధంగా ఫ్లెక్సీని తయారు చేసి దాని ముందు నిలబడి ప్రతిజ్ఞ చేశారు. కానీ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న లక్ష్యాన్ని మరిచారు. ఆ ఫొటోను మాత్రం సర్వర్‌లో అప్‌లోడ్ చేసి ప్లాస్టిక్ నిషేధ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించమని ప్రభుత్వానికి నివేదించుకున్నారు.

అవగాహన కల్పించడం ఎలా?

ప్రభుత్వం ఆదేశించిన కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలగాలంటే గతంలో ప్రభుత్వ అధికారులు చేపట్టే కార్యక్రమాలు ఎక్కడ జరిగేది? ఎన్ని గంటలకు జరిగేది? గ్రామాలలో ముందురోజు దండోరా వేయించేవారు. ప్రతికా ప్రకటనలు ఇచ్చేవారు. అందుకు అనుగుణంగా గ్రామంలో సమావేశాలు, ప్రదర్శనలు చేసేవారు. కానీ పెద్దారవీడు ప్రభుత్వ అధికారులు అవన్నీ మరిచారు. వారికి ఇష్టం వచ్చినరీతిన అనుకూలమైన సమయంలో కార్యక్రమానికి సంబంధించి ఫొటో దిగడం, ఘనంగా చేశామని చెప్పుకుంటున్నారు.


అమలుకు నోచుకోని నిషేధాజ్ఞలు

ఎర్రగొండపాలెం రూరల్ : ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని నాయకులు, అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్లాస్టిక్‌పై నిషేధాజ్ఞలు, స్వచ్ఛ కార్యక్రమాలు నూరుశాతం అమలు కావడం లేదు. ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయాలు ఇలా దేనికైనా ప్లాస్టిక్ కవర్లను విరివిగా వాడుతున్నారు. తర్వాత కవర్లను రోడ్లపై పడేస్తున్నారు. మూగజీవాలు ఆహారం కోసం వేతుకుతూ ఆ ప్లాస్టిక్ కవర్లను కూడా తింటూ మృత్యువాత పడుతున్నాయి. ఆహార పదార్థాలతో విసిరేసిన ప్లాస్టిక్ కవర్లు వారాలతరబడి రోడ్లపై నిల్వ ఉండడంతో భరించలేని కంపుకొడుతోంది. వాటిపై ఈగలు, దోమలు వాలి తిరిగి ప్రజలకు కుట్టడంతో రోగాలబారిన పడుతున్నారు. ఇప్పటికైన ప్రజలు ప్లాస్టిక్ వాడకం తగ్గించి రోగాలబారిన పడకుండ జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు అంటున్నారు. ప్లాస్టిక్ వాడకంపై కచ్చితమైన చర్యలు చేపట్టకపోతే లక్ష్యాలు నీరుగారక తప్పదని ప్రజలు అంటలాగే అధికారులు కూడ కేవలం మాటలకే కాకుండ చేతల్లో కూడ నివారించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పెద్దారవీడులో ప్రతిజ్ఞకే పరిమితమైన అధికారులు, సిబ్బంది

ఘనంగా శాకాంబరి ఉత్సవం



గిద్దలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శాకాంబరి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కూరగాయలు, పండ్లతో అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

రంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాచర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జెల్లివారి పుల్లలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అడవుల్లో వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివా రం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పూజారులు భక్తులకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలో భక్తులకు దర్శనానికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు అందే వసతులపై ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.నాగయ్య పర్యవేక్షించారు. సిబ్బంది రాజేశ్వరరావు, రాంబాబు, లక్ష్మయ్య, భక్తులకు అవసరమైన సహకారం అందించారు. ఆలయంలోని కాపుబలిజ సత్రంలో భక్తులకు అన్నదానాన్ని సత్ర నిర్వాహకులు గోపాలరావు, చంద్రయ్య ఏర్పాటు చేశారు.

ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజారాణి

పెద్దారవీడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజారాణి అన్నారు. మండలంలోని బద్వీటి చెర్లోపల్లిలో శనివారం ఖరీఫ్‌లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజారాణి మాట్లాడుతూ పత్తి, మిరప పంటలలో విత్తనం నాటినప్పటి నుంచి కోత వరకూ చేపట్టవలసిన మెరుగైన యాజమాన్య పద్ధతులను, జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. కందిలో విత్తనాలు నాటే ముందు శుద్ధి చేసుకుంటే వేరుకుళ్లు, ఎండు తెగులు రాకుండా అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్.లక్ష్మీనారాయణ, ఏఈవో సునీల్‌కుమార్ వీఏఏలు, శ్రీకాంత్, రవి, సంధ్యాబాయ్, రైతులు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలలో డీఈవో తనిఖీ

పొదిలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో కిరణ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అకడమిక్ స్టాండర్డ్ పురోగతిపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సబ్జెక్టులవారీ విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించా తగిన బోధన చేయాలన్నారు. టీచర్స్ బుక్‌లో వివరాలను చదివి విద్యార్థికి చదువు చెబితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించారు. హాజరులో ఉన్న విద్యార్థులకు తయారు చేస్తున్న భోజనానికి పొంతన లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇష్టారీతిన భోజనం పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో నాగలక్ష్మి, హెచ్‌ఎం అజీమ్‌బాషా ఉన్నారు.

చోళ్లవీడు పశువైద్యశాలలో ఆకస్మిక తనిఖీ

రాచర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల, చోళ్లవీడు, అనుములపల్లి పశు వైద్యశాలలను పశు వైద్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ బీ రవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలను పశువైద్యాధికారి హరిబాబును అడిగి తెలుసుకున్నారు. పశువులకు, జీవాలకు సంబంధించిన మందుల పంపిణీ ఎంతవరకు చేశారని, ఇంకా చేయవలసి ఏమైనా ఉందా అని ఆరా తీశారు. రైతులకు అందుబాటులో ఉండి సరైన సేవలు అందిస్తున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

రాచర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనుములవీడు గ్రామానికి చెందిన పంక నారాయణ అనుములవీడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టీడీపీ యువనాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు శివ రామిరెడ్డి, చెంచిరెడ్డి, పెద్ద వెంకటేశ్వర్లు, చిన్న వెంకటేశ్వర్లు, బాలరాజు, సంజయ్, దివాకర్, మున్ని, ఆంజనేయులు, నారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ఆంధ్ర అందరి లక్ష్యం కావాలి

- సింగిల్ యూజ్ కవర్లను నిషేధిద్దాం
- మంత్రి స్వామి
- మార్కాపురంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

మార్కాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ అందరి లక్ష్యం కావాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్కాపురంలో శనివారం మంత్రి స్వామితోపాటు కలెక్టర్ తమీం అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. తొలుత స్థానిక కూరగాయల మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వ్యాపారస్తులతో మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. అనంతరం మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, పురప్రముఖులు, ఎన్‌సీసీ విద్యార్థులతో మున్సిపాలిటీ నుంచి గడియారస్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రజలు వినియోగించవద్దని కోరారు. కార్యక్రమాల్లో మార్కాపురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట్‌త్రివినాగ్, జడ్పీ సీఈవో చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, తహసీల్దార్ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కంభం : ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించి స్వ చ్ఛాంధ్ర - స్వచ్ఛ సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ విక్టర్ ఇమ్మానియేలు తెలిపారు. ఎంపీడీవో వీరభద్రాచారి ఆధ్వర్యంలో అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం కందులాపురం సెం టర్‌లో ప్రతిజ్ఞ చేశారు.

బేస్తవారపేట : స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బేస్తవారపేటలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బేస్తవారపేట గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్ వ్యర్థాల అవగాహన కల్పిస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది, అంగన్‌వాడీ, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికం నిర్మూలనే ధ్యేయం

దోర్నాల : పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ-4 విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టారని ఎరిక్షన్‌బాబు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల అధికారులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎరిక్షన్ బాబు హాజరయ్యారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఎన్నో అనర్థాలను తెచ్చే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. పర్యావరణం కలుషితమై వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయని తద్వారా అతివృష్టి, అనావృష్టి ఏర్పడుతోందన్నారు. పీ4లో భాంగా ఆర్థికంగా బాగా ఉన్నవారు పేదవారిని దత్తత తీసుకొని వారి అభివృద్ధికి చేయూతనందించాలని ఎరిక్షన్‌బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి చిత్తూరి హారిక, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, టీడీపీ నాయ కులు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లాపై మాట నిలబెట్టుకుంటాం

మంత్రి స్వామి



బోడపాడులో సీసీ రోడ్డు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి



దోర్నాలలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

మార్కాపురం రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని బోడపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.35లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి స్వామి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామ సెంటర్‌లో జరిగిన సమావేశంలో మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతి పేదకూ న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు కందుల రామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటరెడ్డి, బోడపాడు నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి, జవ్వాజి రామాంజులరెడ్డి, నీటి సంఘం చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున, డీలర్ రామకృష్ణారెడ్డి, కందుల పరమేశ్వరరెడ్డి, యువనాయకులు ఆనెకాళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తర్లుపాడు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. తర్లుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు భవనాన్ని మంత్రి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.9కోట్లతో 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో భవనాలు నిర్మించామన్నారు. త్వరలో రూ.25లక్షల వరకు వైద్యం అందించేలా గొప్ప ఇన్సూరెన్స్ పాలసీని ప్రభుత్వం తీసుకురాబోతున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సీతానాగులవరంలో రూ.25లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న కందులను రైతులకు పంపిణీ చేశారు. తర్లుపాడులోని ఎస్సీ పాలెంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను మంత్రి, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లచ్చా నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఎమ్మార్వో కె.కిశోర్ కుమార్, పంచాయితీరాజ్ ఈఈ శ్రీనివాసులు, డీఈ రవిప్రకాశ్, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, టీడీపీ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, వి.మల్లికార్జున, పి.గోపినాథ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన పాలన

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు

పెద్ద దోర్నాల : ప్రజలు మెచ్చిన ప్రభుత్వ పాలన సాగుతోందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. పాత ఫోస్టాఫీస్ వీధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎరిక్షన్ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ఏడాది పాలనను ప్రజలకు వివరించారు. మురుగు కాలువలు సక్రమంగా లేవని స్థానికులు చెప్పగా సమస్యను పరిష్కరించాలని కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు మాబు, సుధాకర్‌రెడ్డి, శేషాద్రి, మల్లయ్య, మాజీ సర్పంచి హరగోపాల్, చంటి, షేక్ సమ్మద్ బాషా, నాగేంద్రబాబు, వెంకటేశ్వర్లు, షేక్ రఫి, షేక్ మంజూర్‌బాషా, సుబ్బారెడ్డి, షేక్ ఇస్మాయిల్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మురళి, బీజేపీ నాయకులు గండి వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయాలి

- సమీక్షా సమావేశంలో కలెక్టర్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీం అన్సారియా

మార్కాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధుల సహాయ, సహకారాలను తీసుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయడంపై అధికారులు మరింతగా దృష్టి సారించాలని కలెక్టర్ తమీం అన్సారియా సూచించారు. శ్రీనివాస కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం మార్కాపురం డివిజన్ అభివృద్ధి పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల పురోగతిపై శాఖలవారీగా సమీక్షించారు. సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి సమస్యలను ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తే వాళ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా గిరిజన ఆవాస గ్రామాల్లో అర్హులకు ఇళ్లు, ఇతర వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో స్థానిక అటవీశాఖ అధికారుల నుంచి ఏమైనా జాప్యం జరిగితే డిప్యూటీ డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సీజనల్ వ్యాధుల వలన ఎవరైనా చనిపోతే సంబంధిత వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. తల్లికి వందనం డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కావడంలో ఈ కేవైసీ లాంటి సమస్యలు ఉంటే వాటిని త్వరగా పరిష్కరించి వారికి డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీ-4 పథకంలో మార్గదర్శకులను త్వరగా గుర్తించాలన్నారు. జిల్లాలో ఇతర డివిజన్లతో పోలిస్తే మార్కాపురంలో పురోగతి కొంత నెమ్మదిగా ఉందన్నారు. దీనిని వేగవంతం చేయడానికి ప్రజాప్రతినిధుల సహకారంతో ఆయా శాఖలు సమన్వయంగా పనిచేయాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. సమావేశంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, మార్కాపురం, గిద్దలూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్లు సందీప్ కృపాకర్, నిషాకుమారి, వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేగవంతమైన సేవలందించాలి

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సంక్షేమ పాలనలో మున్సిపల్ సేవల్లో పారదర్శకత, వేగం, సమర్థత పెంపొందించేందుకు కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా సిబ్బందికి ఆయన ట్యాబ్‌లను అందచేశారు. ప్రజలకు అందించాల్సిన సేవలు సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులతోపాటు మున్సిపల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య, కమిషనర్ రమణబాబు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న క్యాంటీన్‌ను శనివారం కలెక్టర్ తమీం అన్సారియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో ధరలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించటం లేదన్నారు. అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ పరిసరాలలో పరిశుభ్రత, సరైన సౌకర్యాలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్‌లో మెరుగైన సేవలందించేందుకు ఆదేశాలు జారీ చేశారు. సబ్ లెక్టర్ వెంకట త్రివినాగ్, అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురంలో శనివారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి స్వామికి పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీ ఇచ్చారు. బీసీ బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలని బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

గిద్దలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ శనివారం మున్సిపల్ కార్మికులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.మురళి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రంగయ్య, చంటయ్య, పాపయ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

రాచర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన రాచర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా డీ మేరీ మంజుల శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గుంటూరు పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న మేరీ కుమారిని కంభం బాలికల గురుకులానికి బదిలీ అయ్యారు.

21 నుంచి పొదిలి టు గుంటూరుకు బస్సు

పొదిలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల కోరిక మేరకు జూలై 21 నుంచి ఉదయం 5గంటలకు పొదిలి నుంచి వయా దర్శి అద్దంకి మీదుగా గుంటూరుకు ప్రత్యేక సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ శంకరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. అదే సమయంలో గుంటూరు నుంచి పొదిలికి సర్వీసును నడపనున్నట్లు చెప్పారు.

మహిళలపై రాళ్లదాడి కేసులో ఐదుగురికి బెయిల్

పొదిలి, జూలై 19 (ఆంధరజ్యోతి) : అమరావతి మహిళలనుద్దేశించి అసభ్యంగా మాట్లాడినందకు పొదిలిలో నిరసన తెలుపుతున్న మహిళలపై వైసీపీ మూకలు దాడి చేసిన విషయం తెలిసిందే. దాడికి పాల్పడిన వారిని జూన్ 14న అరెస్ట్ చేశారు. రిమాండ్‌లో ఉన్న వారిలో మేకల కృష్ణారెడ్డి ముండ్లమూరు మండలం, నలమోలు మోహన్ దర్శి, మన్నం శ్రీధర్ చీమకుర్తి, బొరిగొర్ల గోపి కొనకనమిట్ల మండలం, గుర్రం బాలకృష్ణకు బెయిల్ మంజూరు చేసినట్లు ఎస్ఐ వేమన తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఎర్రగొండపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. వైపాలెం నియోజకవర్గ కేంద్రంలో వైసీపీ ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పేరుతో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికలు వస్తే వైసీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వైసీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల, జిల్లా పరిశీలకుడు బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ కిరణ్‌గౌడ్, ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే చంద్రశేఖర్

ముఖాముఖి

రాయితీపై యంత్ర పరికరాలు

ఎన్.రంగాక్రిష్ణ, ఏవో, పీసీపల్లి



ప్రశ్న: రాయితీపై రైతులకు ఏయే పరికరాలు అందజేస్తున్నారు?

జవాబు: గొర్రు, నాగలి, ట్రాక్టర్ స్ప్రేయర్, రోటావేటర్, గుంటక, దమ్ముచక్రాలు రైతులకు పంపిణీచేస్తున్నాం.

ప్ర: మండలంలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారు?

జ: మండలంలో 1274మంది కౌలు రైతులను గుర్తించాం. వారికి రెవెన్యూ శాఖ తరఫున కౌలు కార్డులు ఇచ్చాం.

ప్ర: ఖరీఫ్ సీజన్‌లో ఏయే పంటలను అధికంగా సాగుచేస్తారు?

జ: గత ఏడాది ఖరీఫ్‌లో 12వేల ఎకరాల్లో కంది పంటను సాగుచేశారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సుమారు 10,500 ఎకరాల్లో కంది సాగచేయవచ్చునని అంచనా వేశాం. మరో 800ఎకరాలలో వరి సాగుచేయనున్నారు.

ప్ర: అన్నదాత సుఖీభవకు ఎంతమంది రైతులను అర్హులుగా గుర్తించారు?

జ: మండలంలో ఆరువేల మంది రైతులను అన్నదాత సుఖీభవకు అర్హులుగా గుర్తించాం. అర్హులైన రైతులందరికీ ఈకేవైసీ కూడా పూర్తిచేశాం. త్వరలోనే ప్రభుత్వం వారి ఖాతాల్లో నగదు జమ చేయనుంది.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

పామూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత పట్టణంగా పామూరును తీర్చిదిద్దుతామని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డి, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఏపీఎం జి.విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

ముండ్లమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఐతఈఆర్డీ స్వచ్ఛంద సేవా సంస్థ నేషనల్ మెడిషనల్ ప్లాంట్ బోర్డు సహకారంతో శనివారం కేజీబీవీ జూనియర్ కళాశాలలో మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి సునీత మాట్లాడుతూ మనం నాటుతున్న మొక్కలు రేపటి తరానికి ఆరోగ్యాన్ని అందించగలవన్నారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో 70 వేర్వేరు రకాల ఔషధమొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బత్తుల కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పామూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్యే ఉగ్ర ఆదేశాలమేరకు మండలంలోని బుక్కాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, వై.ప్రసాదరెడ్డి, జి.శ్రీనివాసులు, ఎం.నరసింహారావు, ఎం.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జూట్ బ్యాగులనే వినియోగించాలి

కురిచేడు, జూలై 19(ఆంధ్రజ్యోతి): జూట్ బ్యాగులు, సంచులనే ప్రజలు వినియోగించాలని ఎంపీడీవో సూచించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులు వినియోగించవద్దని, వినియోగదారులకు ఇవ్వవద్దని దుకాణాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో వస్రాం నాయక్, మండల స్థాయి అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలతో ఆదాయం

తాళ్లూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల్లో వచ్చే ఆదాయంతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూర్చుకోవచ్చని ఎంపీడీవో దారా హనుమంతరావు అన్నారు. శనివారం తాళ్లూరులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనే లక్ష్యంగా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. అలాగే, వెలుగువారిపాలెంలో హెచ్ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను వివరించారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిని బట్టి బోధించాలి

తాళ్లూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసన స్థాయిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు బోధన చేయాలని మండలవిద్యాశాఖాధికారి గురజాల సుబ్బయ్య తెలిపారు. తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, తాళ్లూరులోని ఉన్నత పాఠశాలల్లో శనివారం క్లస్టర్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సును గుర్తించి తదనుగుణంగా బోధన చేస్తే రాణిస్తారన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణ పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణ సమీపంలోని కొత్తూరు బైపాస్ కూడలి వద్ద అధికారులు, వివిధశాఖల సిబ్బందితో మానవహారం నిర్వహించారు. అనంతరం కొత్తూరు నుంచి పామూరు బస్టాండు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలన్నారు. అనంతరం బైపాస్ డివైడర్‌లలో మొక్కలు నాటారు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, అధికారులు

వాగులో పూడిక తొలగింపు

దశాబ్దకాలంగా కొత్తూరు వాగు చప్టా వద్ద ఉన్న తూము పూడికతో పూర్తిగా నిండిపోయి చెత్తాచెదారాలతో దుర్వాసన వస్తుంది. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొత్తూరు ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే వాగులో ఉన్న పూడికను గమనించారు. మున్సిపల్ అధికారులను, సిబ్బందిని వెంటనే పిలిపించారు. వాగులో పూడికను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డిని ఆదేశించారు. ఎక్స్‌కవేటర్‌తో వాగులో ఉన్న పూడికను, తూముకు అడ్డంగా ఉన్న చెత్తను తొలగించి మురుగునీరు సక్రమంగా వెళ్లేలా చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్, గుడ్ హెల్ప్ రమేష్ బాలు ఓబులురెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభం

కనిగిరి నుంచి విజయవాడకు సూపర్ లగ్జరీ బస్సును ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి డిపో పరిధిలో 51 నూతన బస్సు సర్వీసులను ప్రారంభించినట్టు చెప్పారు. కనిగిరి నుంచి విజయవాడకు కొత్త బస్సులను పెంచినట్లు తెలిపారు. త్వరలో గ్రామీణ ప్రాంతాలకు కూడా నూతన బస్సులను కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం డిపోలోని టాయిలెట్స్‌ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీటీవో సత్యనారాయణ, డీఎం షయానాబేగం, మాల్యాద్రి, మున్సిపల్ చైర్మన్ గఫార్, నంబుల వెంకటేశ్వర్లు యాదవ్, కొండయ్య, జంషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ఒకటో వార్డులో ఏడాది సుపరి పాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాల అమలును ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర వివరించారు.


వాగులో పూడిక తొలగింపు పనులను పరిశీలిస్తున్న డాక్టర్ ఉగ్ర

లక్షలు వెచ్చించారు... నిరుపయోగంగా ఉంచారు!




ప్రారంభానికి నోచుకోని నూజెండ్లపల్లిలోని ఆరోగ్య ఉప కేంద్రం, రైతు భరోసా కేంద్రం



నిరుపయోగంగా గ్రామ సచివాలయం

» చాలీచాలని భవనంలో సాగుతున్న నూజెండ్లపల్లి సచివాలయం

» ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

» పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్లపల్లి గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు నిర్మించారు. 2019 వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రతి గ్రామంలో సచివాలయ భవనాలు నిర్మించాలన్న లక్ష్యంతో నూజెండ్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో 2020 - 21 సంవత్సరంలో రూ.35 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయ భవనం నిర్మించారు. అలాగే, రూ.18 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించారు. నిర్మించి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ఆభవనాలను ప్రారంభించలేదు. గ్రామంలో ఉన్న పాత పంచాయతీ కార్యాలయంలో గ్రామ సచివాలయం కొనసాగుతుంది. అక్కడ ఇరుకు గదుల్లోనే సిబ్బంది ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. లక్షలాది రూపాయలు వెచ్చించి ఊరికి సమీపంలో విశాలంగా నిర్మించినా కూడా ఇంతవరకు నూతన భవనాల్లో చేరలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాలను వాడుకలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శ్రీనిధి రుణాల అవకతవకలపై విచారణ

పామూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): శ్రీనిధి రుణాల మంజూరులో జరిగిన అవకతవకలపై జిల్లా కలెక్టర్ ఆదేశాలపై విచారణ జరుపుతున్నట్లు జిల్లా ఇన్‌చార్జి ఏపీడీ కె.లక్ష్మీరెడ్డి, శ్రీనిధి జిల్లా ఏజీఎం ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శనివారం పామూరు వెలుగు కార్యాలయంలో విచారణ చేశారు. శ్రీనిధి రుణాల రికవరిలో 2013లో పనిచేసిన అప్పటి అధికారులు, సీసీలు తన చేత తప్పులు చేయించారని వీవోఏ పల్లపు బేబి గతనెల 14న కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఐదు గ్రూపులకు సంబంధించి రూ.16 లక్షల 50 వేలు సీసీఎల్ రుణాలను ఎన్‌పీగా ఉన్న గ్రూపులకు బదలాయించారని తెలిపారు. అందులో తన పాత్ర లేదని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈనేపథ్యంలో ఈనెల 17న ఒంగోలులో జరిగిన విచారణకు ఏపీఎం జి.విద్యాసాగర్ అప్పటి సీసీ జీవీ భాస్కరరెడ్డి హాజరయ్యారు. శనివారం పామూరులో జరిగి విచారణకు పల్లపు బేబి అందుబాటులో లేరు.


నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరుపుతున్న ఏపీడీ లక్ష్మీరెడ్డి

కాగా, 2013 నుంచి శ్రీనిధి రుణాలకు సంబంధించి బ్యాంకు స్టేట్‌మెంట్ల ప్రకారం విచారిస్తున్నట్టు ఏపీడీ కె.లక్ష్మీరెడ్డి, ఏజీఎం ఉదయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం జి.విద్యాసాగర్, సీసీఆర్ సరళ పాల్గొన్నారు. రు.2కోట్ల మేర శ్రీనిధి రుణాలు గోల్‌మాల్ జరిగిందని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నారు. త్వరితగతిన విచారణచేసి బాధ్యుల నుంచి రికవరి సొమ్మును రాబట్టి బాధిత మహిళలకు న్యాయం చేయాలని పొదుపు గ్రూపు మహిళలు కోరుతున్నారు.

శిథిలావస్థలో పాఠశాల

» పెచ్చులూడుతున్న స్లాబ్

» ఆందోళనచెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పామూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంత నిరుపేద విద్యార్థులకు విద్యను అందించే లక్ష్యంతో ఏర్పాటుచేసిన ప్రభుత్వ పాఠశాల ప్రమాదపుటంచున ఉంది. ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం పంచాయతి పరిధిలో గల రేగిచెట్లపల్లి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు భయంభయంగా విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలకు చెందిన రెండు పాత గదులు, వంటశాల శిథిలావస్థకుచేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం విద్యార్థులు ఉంటున్న గది కూడా స్లాబు పెచ్చులు ఊడుతున్నాయి. దాంతో భయం భయంతో విద్యాబోధన చేయాల్సి వస్తుందని ఉపాధ్యాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని పాలకుల మాటలు ఆచరణలో కన్పించడంలేదు పాఠశాలలో 18 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. 1 నుంచి 5వ తరగతికి ఒకే ఒక గది, ఒకే ఉపాధ్యాయుడితో విద్యాబోధన సాగుతుంది.

గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నాడు నేడు పథకంలో నూతన గదులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరినా పట్టించుకోలేదు. పాఠశాల ప్రహరి గోడలు కూడా సగం విరిగిపోయి మొండి గోడలుగా దర్శనమిస్తున్నాయి. పాఠశాలకు చెందిన వంటగది రేకులు లేచిపోవడంతో పిచ్చి మొక్కలతో శిథిలావస్థకు చేరింది. దీంతో కుకింగ్ ఏజెన్సీ నిర్వహకురాలు ఇంటి వద్దనే భోజనం తయారుచేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న ఉన్న పాఠశాలలను తొలగించి నూతన గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పెచ్చులూడుతున్న స్లాబ్


కూలేందుకు సిద్ధంగాఉన్న పాఠశాల భవనం, వంట గదులు

ఏడాదిలో ఎంతో చేశాం!

» ప్రజలకు జవాబుదారీగా ప్రభుత్వం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలే పాలకులని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం దర్శిలోని క్రిష్టియన్‌పాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని వివరించారు. పథకాలు అందుతున్నాయా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీచేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో 90 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తుందని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మున్సిపల్ వైస్‌చైర్మన్ స్టీవెన్, నాయకులు సంగా తిరుపతిరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

దర్శి, జూలై 19(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలోని 40 మంది బాధితులకు రూ. 24 లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధరోగాల బారినపడి ఇబ్బందులు పడుతున్న పేదలను సీఎం చంద్రబాబు దయార్థ హృదయంతో ఆదుకుంటున్నా రన్నారు. అడిగిన వెంటనే బాధితులకు సహాయం అందుతుండటంతో వారిలో ఆనందం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసులు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

పంటల సాగులో సాంకేతిక పద్ధతులు పాటించాలి

దర్శి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో సాంకేతిక పద్ధతులను అవలంబించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు కంది, జొన్న, సజ్జ తదితర పంటలు సాగు చేసుకోవచ్చునని చెప్పారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ సంధ్యారాణి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ విజయనిర్మల, వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాద్, ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన అధికారి డాక్టర్ రవీంద్రబాబు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

దొనకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): దొనకొండ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి వలసలు నివారించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వీవీపురంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘ సమావేశానికి కుందుర్తి చిన్ననర్సింహులు అధ్యక్షత వహించారు. కంకణాల మాట్లాడుతూ ఆగస్టు 12, 13 తేదీల్లో కనిగిరిలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలకు ఈప్రాంతం నుంచి అధికసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండా చిన్నముసలయ్య, కార్యదర్శిగా కుందుర్తి చిన్ననర్సింహులు, సభ్యులుగా రాయని చెన్నయ్య, ముసుగు నాగమణి, బెల్లం దుర్గ తదితరులను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయులకు హ్యాండ్‌బుక్‌లు అందజేత

సీఎస్‌పురం(పామూరు), జూలై 19(ఆంధ్రజ్యోతి): 1 నుంచి 5వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్‌లను అందజేస్తున్నట్టు ఎంఈవో జె.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని సినాగులారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం క్లస్టర్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా 1 నుంచి 5 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు 18 హ్యాండ్ బుక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు బి.డేవిడ్, పెదరాజుపాలెం హెచ్ఎం కె.వెంకటేశ్వర్లు, కార్యదర్శి జి.శ్రీనివాసులు, షేక్ పాదుషా, సీహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి సారించాలి

దర్శి, జూలై 19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్యక్రమాలను క్రమంతప్పకుండా నిర్వహించి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర నిర్మాణానికి కృషి చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆవుల సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ

దొనకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా ప్రారంభించిన టైప్-4 కేజీబీవీ బాలికల వసతి గృహాన్ని జిల్లా సమగ్ర శిక్ష గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి కె.హేమలత శనివారం తనిఖీ చేశారు. ఈ ప్రాంత బాలికల విద్యాభివృద్ధికి ఎంతో ప్రాముఖ్యమైన ఈ వసతి గృహాన్ని జిల్లాలో మొదటగా ప్రారంభించటం ఎంతో అభినందనీయమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వీవీ రామాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.


వసతి గృహ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న జీసీడీవో హేమలత

సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలి

పీసీపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు వినియోగదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు అందజేయాలన్నారు. సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

కనిగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యాన పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం రైతులకు రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేస్తుందని ఉద్యానశాఖ ఏవో విష్ణుప్రియ అన్నారు. మండలంలోని తుమ్మకుంట గ్రామంలో జామ తోటను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో సేద్యపు నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.75 వేలు రాయితీపై మంజూరు చేస్తుందన్నారు. రక్షిత సేద్యంలో పాలిహౌస్, షెడ్‌నెట్, ప్లాస్టిక్ మల్చింగ్ తదితరవాటికి 40శాతం రాయితీపై రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన ఉగ్ర

కనిగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్, ఆనంద నిలయన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సందర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని హాస్టల్‌లో మరమ్మతులు చేయించారు. హాస్టల్‌లో సౌకర్యాలపై విద్యార్థులను ఎమ్మెల్యే అడుగగా వారు బాగుందంటూ తెలిపారు. గతంలో బాత్‌రూంకు వెళ్ళాలంటే ఎంతో ఇబ్బందిగా ఉండేదన్నారు. అదేవిధంగా ఆనంద నిలయంను సందర్శించారు. ఎమ్మెల్యే వెంట జంషీర్, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హతలేదు!

దర్శి, జూలై 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదని దర్శి, ముండ్లమూరు, తాళ్ళూరు మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసరావు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా ధ్వజమెత్తారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్యాలెస్ రాక్షసుడు జనం మీదపడి ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. గంజాయి బ్యాచ్‌లను పరామర్శించటం, నేరస్తులకు కొమ్ము కాయటం వైసీపీ నేతలకు నైజంగా మారిందన్నారు. బియ్యం దొంగ కారుమూరి నాగేశ్వరరావు, పావలా శ్యామల తదితరులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను విమర్శించటం శోచనీయమన్నారు. లిక్కర్ స్కామ్ నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వల్లమాలిన ప్రేమ చూపించటం విడ్డూరంగా ఉందన్నారు. స్కామ్‌లలో కూరుకుపోయి వైసీపీ నాయకులు వరుసగా జైళ్లకు క్యూ కడుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది పాలన పట్ల అన్నివర్గాల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రం బాలకృష్ణ, అంబటి గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మగోడు



● మంగళగిరికి చెందిన ఓ యువకుడు సంప్రదాయంగా వచ్చిన వృత్తిని స్వీకరించాడు. అతడు నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నాడు. పదేళ్లుగా సంబంధాలు చూస్తున్నా పెళ్లిచూపులకు కూడా అతడు నోచుకోవడంలేదు. అతడు చేసే వృత్తి గురించి చెప్పగానే ఉద్యోగం లేదా అంటూ అవతలి వైపు నుంచి పెళ్లి ప్రస్తావన ఆగిపోతోంది.

● తెనాలికి చెందిన ఓ యువకుడు బంగారపు పని చేస్తూ నెలకు 70 వేల వరకు సంపాదిస్తాడు. ఇల్లు ఉంది. అయినా పెళ్లి కుదరడం లేదు. బంగారపు పనిచేసుకునే వారికి ఇవ్వం అని అమ్మాయి తరపు వారు తెగేసి చెబుతున్నారు.

● ఓ యువకుడు కార్పెంటర్ పని చేస్తూ నెలకు రూ.40 వేల నుంచి 50 వేలు సంపాదిస్తున్నాడు. కానీ అతడికి 30 దాటినా పెళ్లి కల నెరవేరలేదు. అతడు చేసే పని చెప్పగానే సంబంధాలు వెనక్కి వెళ్లిపోతున్నాయి.

● డిగ్రీ పూర్తి చేసిన ఓ యువకుడు ఓ కంపెనీలో రూ.20 వేల జీతానికి ఉద్యోగం చేస్తున్నాడు. గత ఐదేళ్లుగా రెండు డజన్లకు పైగా సంబంధాలు వచ్చినా అతడికి వచ్చే జీతం చూసి తిరుగుటపాలో వెళ్లిపోతున్నాయి.

డిప్రెషన్‌లో పెళ్లికాని ప్రసాద్‌లు

- అమ్మాయిల ఆలోచనల్లో మార్పులతో తిప్పలు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉండాలంటోన్న యువతులు
- ఐదు అంకెల జీతం ఉంటేనే మూడుముళ్లకు సిద్ధం
- స్వయంవరంలో సంప్రదాయ కులవృత్తుల యువత ఓటమి

పెళ్లి.. పురుషుడికి పగటి కలగా మారుతోంది. అబ్బాయిలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉంటేనే అమ్మాయిలు పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. ఐదు అంకెల జీతం అందుకున్న వారితోనే మూడుముళ్లు వేయించుకుంటున్నారు. కొంతమంది అబ్బాయిలకు పెళ్లి చూపులు.. ఎదురు చూపులుగా మారుతున్నాయి. సంప్రదాయ కులవృత్తులు చేసుకునే వారు, వ్యవసాయం, ఇతర పనులపై ఆధారపడే వారు, చిరు జీత గాళ్లు, కూలి పనులతో జీవనం చేసుకునే యువకులు వివాహ బంధానికి నోచుకోవడం లేదు. తల్లిదండ్రులకు అండగా గ్రామాల్లో, చిన్న చిన్న పట్టణాల్లో ఉంటూ ఏదో ఒక పని చేసుకునే వారు కూడా మూడు ముళ్ల బంధాన్ని మరిచి పోవాల్సి వస్తోంది. దీంతో పెళ్లీడుకు వచ్చిన మగపిల్లలు అనేక మంది డిప్రెషన్‌కు గురవుతున్న సందర్భాలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి.

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇలా ఒక సంబంధం విషయంలో అయితే పర్వాలేదు.. డజన్ల కొద్దీ సంబంధాలదీ ఇదే పరిస్థితి. సమాజంలో పురుష, స్త్రీ నిష్పత్తిలో వ్యత్యాసాలు రావడంతో అది పెళ్లిళ్లపై పడింది. దీంతో వివాహానికి సంబంధించి గతంలో ప్రాధాన్యాలు అబ్బాయిలకు ఉండగా ఇప్పుడు ఆ అవకాశం అమ్మాయిలు చేజిక్కించుకున్నారు. సంప్రదాయ వృత్తులైన వ్యవసాయం, వడ్రంగం, కుమ్మరి, కమ్మరి, మంగలి, పౌరోహిత్యం తదితర వృత్తులు చేసుకునే యువకులు పెళ్లి పగటి కలలా మారింది. బేల్దారి, టైలరింగ్, ఇతర చిన్న చిన్న పనులు చేసుకుంటూనో.. స్థానికంగా చిరు జీతాలతో ఉద్యోగం చేసుకుంటూనో.. గ్రామాల్లో ఉంటూ వ్యవసాయంపై ఆధారపడే వారు.. కూలి పనులు చేసుకునే వారికి కూడా పెళ్లి సంబంధాలు రావడం లేదు. యుక్త వయసుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పెళ్లంటే ఎంతో ఆశగా మారింది.





● మూడు పదులు దాటినా..

సహజంగా జీవితంలో స్థిరపడ్డాక పెళ్లికి అబ్బాయిలు సిద్ధపడతారు. అయితే గత కొన్నేళ్లుగా ఇలాంటి వారికి సంబంధాలు కుదరడం కష్టంగా మారింది. మూడు పదులు దాటినా పెళ్లి కాని పరిస్థితి మగవాళ్లకు ఎదురవుతోంది. కుల, చేతి వృత్తులపై ఆధారపడిన యువకుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వారికి సంబంధాలు చూడడం, వెదకడమే కష్టంగా మారిపోయింది. వారి పెళ్లి ఊసెత్తగానే అయినవాళ్లు కూడా ముఖం చాటేస్తున్నారు. దూరపు బంధువులు ముఖం మీదే కాదని చెప్పేస్తున్నారు. సంప్రదాయ వృత్తుల్లో ఉండేవారిపై ఆడపిల్లల కుటుంబాల్లో ఆసక్తి తగ్గిపోవడంతో పెళ్లిళ్ల మధ్యవర్తులు కూడా పక్కకు తప్పుకుంటున్నారు.

వాళ్లు కనీసం అబ్బాయి ఫొటో, బయోడేటా కూడా తీసుకోవడానికి సుముఖంగా ఉండడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్, వ్యాపార ప్రముఖులు అయితేనో, రూ.కోట్లలో ఆస్తులు ఉంటేనో.. మధ్యవర్తులు సంబంధాలు చూస్తున్నారు.

● ఆడపిల్లల కుటుంబాల్లో విపరీత ధోరణులు

మారిన పరిస్థితుల రీత్యా పెళ్లి కావాల్సిన ఆడపిల్లలకు డిమాండు పెరిగింది. దీంతో ఆడపిల్లల కుటుంబాల ఆలోచనా ధోరణిలో విపరీత మార్పులు కనిపిస్తున్నాయి. సాదా, సీదా సంబంధాలను వారు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఆడపిల్లలు విద్యావంతులు కావడంతో వారి ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది. గతంలోలా కాకుండా తమ అభిరుచులకు తగినవారైతేనే సంబంధానికి ఓకే చెబుతున్నారు. ఆర్థికంగా మెరుగైన, సుభిక్షమైన జీవితాన్ని కోరుకుంటూ అందుకనుగుణంగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. దీంతో సాదా, సీదా ఉద్యోగాలు చేసే వారికి, సంప్రదాయ, కుల వృత్తులను నమ్ముకున్నవారికి పెళ్లిళ్లు గగనమైపోయాయి.

కన్వర్షన్.. కనికట్టు

- పుట్టగొడుగుల్లా అనధికార లేఅవుట్లు
- అధికారుల ఒత్తిడి.. నిబంధనలకు తిలోదకాలు

చీరాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోజు రోజుకు అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వేటపాలెం మండలం అక్కయ్యపాలెం, కొత్తపేట, రామాపురం, చల్లారెడ్డి పాలెం, పాపాయిపాలెం, కఠారిపాలెం ప్రాంతాల్లో పంట భూములను మెరక చేసి విక్రయిస్తున్నారు. అధికారులు కంటి తుడుపుగా కన్వర్షన్ చార్జీలు కట్టిస్తున్నారే కానీ చర్యలు తీసుకోవడంలేదు. అధికారులపై ఒత్తిడి లేకుంటే ఆయా లేఅవుట్లపై కన్నెత్తి కూడా చూడటం లేదు.కన్వర్షన్ చార్జీలతో మమ అనిపించి తదుపరి నిబంధనలకు నిర్మాణదారులు తిలోద కాలిస్తున్నారు. లే అవుట్ అనుమతికి కన్వర్షన్ కడితే సరిపోదు. సామాజిక, భవిష్యత్తు అవస రాలకు, ఖాళీ ఉంచాలి. మౌలిక వసతులకు ఏర్పాట్లు కల్పించాలి. ఆ తర్వాత పంచాయతి నుంచి అనుమతి పొంది మాత్రమే విక్రయాలు జరపాలి. అప్పుడే కొనుగోలుదారుడికి బ్యాంకు నుంచి రుణ సాయం వస్తుంది. కానీ ఇక్కడ వీటికి భిన్నంగా వ్యవహారాలు సాగుతున్నాయి. వాస్తవానికి అక్రమార్కులు చెల్లించే కన్వర్షన్ చార్జీలకు, రికార్డుల్లో చూపించే ధరలకు పొంతన ఉండటం లేదు. నియోజక వర్గంలో చాలా వరకు అక్రమ లేఅవుట్లు ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు.



ఎక్స్‌కవేటర్‌తో అంతర్గత రహదారులు ఏర్పాట్లు



వేటపాలెం మండల పరిధిలో తాజాగా ఛలానా చెల్లించి లే అవుట్ నిర్మాణం

ఏ లేఅవుట్‌కూ అనుమతి లేదు

మండల పరిధిలో సుమారు 80 లే అవుట్లు ఉన్నట్లు సమాచారం. అయితే వాటిల్లో ఏ లేఅవుట్‌కు పంచాయతి అనుమతులు ఇవ్వలేదు. అనధికార లే అవుట్లతో కొనుగోలుదారులకు తీవ్ర నష్టం. వీటిపై నిశితంగా పరిశీలన చేసుకోవాలి. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమంగా విక్రయా లు జరిపితే చర్యలు తీసుకుంటాం.

-రాజేష్‌బాబు, ఎంపీడీవో వేటపాలెం

ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి

- ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీలో కలెక్టర్ వెంకటమురళి పిలుపు
- పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రజలదే : ఎమ్మెల్యే వేగేశన



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి, నాయకులు, విద్యార్థులు, పారిశుధ్య సిబ్బంది



శానిటరి సిబ్బందిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహితంగా జిల్లాను తీర్చిదిద్దాలని కలెక్టర్ జె.వెంకటమురళి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాన్ని వివరిస్తూ శనివారం బాపట్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్‌యార్డు నుంచి ఆర్వోబీ వరకు జరిగింది. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ చెత్తతో భూమి, గాలి, నీరు కాలుష్యం కాకుండా ప్రజలు పర్యావరణాన్ని కాపాడాల న్నారు. ఇళ్ల నుంచే వ్యర్థాలు విభజన జరగాలన్నారు. క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి, విక్రయాలు, వినియోగాన్ని నిషేధించామన్నారు. ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమంపై దృష్టి సారించామన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను ప్రజలు గుర్తించి వాటి వినియోగాన్ని నిలిపివేయాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ నాగరికత మనిషి మనుగడకు ప్రమాదకరంగా మారిందన్నారు. డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమన్నారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డిప్యూటీకలెక్టర్ లవన్న, ఆర్డీవో పి.గ్లోరియా, సీపీవో షాలెంరాజు, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్.సలీమా, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలోనే సాగునీరు

- ఆగస్టు తొలివారంలో కుడి కాల్వకు విడుదల
- వరి సాగు తగ్గించి.. ఉద్యాన విస్తీర్ణం పెంచాలి
- సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయాలు

సమావేశంలో చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యేలు యరపతినేని, అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ ఏసురత్నం



నరసరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు ఆగస్టు మొదటి వారంలో సాగు నీరు విడుదల చేయాలని సాగునీటి సలహా మండలి నిర్ణయించింది. జోన్-1కు తొలి దశలో నీటి సరఫరాకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తీర్మానించారు. పల్నాడు కలెక్టరేట్‌లో శనివారం జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ అధ్యక్షతన సాగునీటి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే లు యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ ఏసురత్నం, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి హాజరయ్యారు. ఖరీఫ్ పంటల సాగుపై ప్రధానంగా చర్చించారు. వరి సాగు తగ్గించి ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాలని పలువురు సూచించారు. పొగాకు కంపెనీల నుంచి అనుమతి పత్రాలు ఉంటేనే బర్లీ పొగా కు సాగు చేయాలని రైతులకు సూచించారు.

పోస్టులను భర్తీ చేయాలి

సాగర్ కుడి కాల్వ పరిధిలో ఉద్యో గుల కొరత ఉందని, లస్కర్, ఏఈ, జేఈ పోస్టులను భర్తీ చేయాలని పలు వురు కోరారు. 3,500 ఎకరాలు ఉన్న బుగ్గవాగు అక్రమణలకు గురై.. రెండు వేల ఎకరాలకు తగ్గిందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యం 5 టీఎంసీలకు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 30 శాతం మాత్రమే కాల్వల ఆధునికీకరణ పూర్తయిందని, చివరి భూములకు నీరు అందడం లేదని పీసీ వైస్ చైర్మన్ చక్రపాణి తెలిపారు. అధికారులు, నీటి సంఘాల సమన్వయంతో చివరి భూములకు నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్లకు గుంటూరు హబ్ కావాలి

విద్యార్థులకు అవగాహనా సదస్సులో మంత్రి లోకేశ్



గుంటూరు (విద్య), జూలై 19 (ఆంధ్ర జ్యోతి): చార్టర్డ్ అకౌంటెంట్లను తయారు చేసే హబ్‌గా గుంటూరు కావాలని ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం గుంటూరు అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో సీఏ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో లోకేశ్ ప్రసంగించారు. గుంటూరులో వైద్యం, ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారికంటే సీఏ అభ్యసించేవారే ఎక్కువగా ఉన్నారన్నారు. సీఏ చదివేందుకు ఏటా 10 వేల మంది గుంటూరు రావడం హర్షణీయమన్నారు. అత్యుత్తమ ప్రతిభ, అధిక ఉత్తీర్ణతా శాతంతో, సమున్నత లక్ష్యాలు కలిగిన చార్టర్డ్ అకౌంటెంట్లను తయారు చేయాలని, ఇందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భారత దేశం గర్వపడేలా గుంటూరు నుంచి గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు చార్టర్డ్ అకౌంటెంట్లు ప్రతిభ చాటుతున్నారన్నారు.

స్మార్ట్‌మీటర్లపై అపోహలు వద్దు

- సెంట్రల్ పవర్ కార్పొరేషన్ సీఎండీ పుల్లారెడ్డి

బాపట్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అపోహలు అవసరం లేదని సెంట్రల్ పవర్ కార్పొరేషన్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. స్థానిక బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లో ఓల్టేజి సమస్యలు, విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ఇందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు మరింత అవగాహన కలిగించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయ్యులర్ తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ ఎ.మురళీకృష్ణయాదవ్, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ప్రాజెక్ట్ మూర్తి, ఎస్ఈ జి.ఆంజనేయులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ పవర్ కార్పొరేషన్ సీఎండీ పుల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల

ఖైదీలు క్షణికావేశానికి లోనుకావొద్దు

రేపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశానికి లోనై తప్పులు చేస్తే కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల తెలిపారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించి జైల్లో ఉన్న ఆహార సదుపాయాలు, జైలు గదులను పరిశీలించారు. అనంతరం సబ్ జైలులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఖైదీలకు న్యాయ సహాయం కోసం వారికి ఉచితంగా న్యాయవాదులను నియమిస్తామన్నారు. జైలు జీవితంలో మానసిక ప్రశాంతతను పెంపొందించుకుని సన్మార్గంలో నడవాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కుమారి వి.గీతాభార్గవి, జైలుసిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థి ప్రతిభ



ఖాజావలిని సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి షేక్ ఖాజావలి ప్రతిభ చాటారు. కర్ణాటక రాష్ట్రంలో దేవనగర్‌లో జరిగిన పోటీల్లో కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జూనియర్ మెన్ బెస్ట్ లిఫ్టర్ ఇన్ ఇండియా సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. దీంతో శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ డా.జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

వేటపాలెం (చీరాల), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని ఆమోదగిరిపట్నం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శేఖరరావు అన్నారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీ వెంకటేశ్వర్లు సుధాకర్, రత్నం, రాజ్యలక్ష్మీ, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై మార్టూరులో ర్యాలీ

మార్టూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాలలో ప్లాస్టిక్ నిషేధించాలని కోరుతూ స్కూలు విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. మార్టూరులో రాయల్ స్కూల్ బజారులో జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావులు పాల్గొన్నారు. అదేవిధంగా మార్టూరులో గన్నవరంరోడ్డు, పెద్ద అండరుపాస్ వద్ద, ఫ్లైవోవరు ప్రక్కన రోడ్లపై బ్లీచింగ్ ను చల్లించారు. వలపర్ల గ్రామంలోని ప్రధాన సెంటరు లో ఎస్‌సీసీ విద్యార్థులు, అంగనవాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అంతేగాకుండా సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి హరిబాబుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నాగరాజుపల్లిలో సర్పంచ్ దాసరి నరేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

ప్లాస్టిక్ రహిత సమాజంలో అందరూ భాగస్వాములు కావాలి

చినగంజాం, జూలై 19(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.విజయలు అన్నారు. చినగంజాంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై శనివారం అధికారులు, గ్రామ పంచాయతి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో ర్యాలీ అనంతరం అధికారులు, విద్యార్థులు మానవహారం నిర్వహించి, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్లాస్టిక్ నిషేదంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రాజశేఖర్, బసవరాణి, ఏపీఎం జి.సుబ్బారావు, ఏపీవో జె.లక్ష్మిదేవి, గ్రామ కార్యదర్శి అంజయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, చినగంజాం జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

అద్దంకిటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత పర్యవరణహిత సమాజమే లక్ష్యంగా మన మందరం ముందుకు సాగాలని అద్దంకి మున్సిపల్ కమిషనర్ ఏ.రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ వ్యర్థాలతో హానికర చర్యలు, ప్రజారోగ్యంపై వాటి దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీంద్ర హాజరై మాట్లాడారు. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ మస్తాన్‌వలి ప్లాస్టిక్ వ్యర్థ యాజమాన్యం, వ్యక్తిగత పాత్రలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఏఎస్ఏ కన్వీనర్ డాక్టర్ వి.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో డి.రాజశేఖర్, ఎన్.షర్మిలారాణి, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ సీహెచ్.ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన పెంచాలని జడ్పీ డిప్యూటీ సీఈవో బాలమ్మ అన్నారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంపీడీవో స్వరూపారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాలమ్మ మాట్లాడుతూ వినియోగించదగిన, వినియోగించకూడని ప్లాస్టిక్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనంతరాజు, జడ్పీటీసీ సభ్యురాలు రాయని ప్రమీల, తహసీల్దార్ సింగారావు తదతరులు పాల్గొన్నారు.

పరసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

పర్చూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఎస్సై జీవీ.చౌదరి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ప్రాంగణంలోని చిల్లచెట్లను తొలగించటంతోపాటు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ భారత్



పోలీస్ స్టేషన్‌లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి : స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో తొలగించారు. అద్దంకి కొండ వద్ద డంపింగ్ యార్డు తొలగించిన ప్రాంతంలో అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసేలా చర్యలు

- కలెక్టర్ వెంకటమురళి
- పర్చూరులో ఏఎంసీ గోడౌన్ల పరిశీలన



కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

పర్చూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా కలెక్టర్ జే.వెంకటమురళి అన్నారు. శనివారం పర్చూరు ఏఎంసీ, మార్క్‌ఫెడ్ గోడౌన్‌లలో నిర్వహిస్తున్న బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత రైతులతోపాటు, స్థానికంగా కొనుగోలు చేస్తున్న బయ్యర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు చేసుకునే విధంగా తమ పేర్లను నమోదు చేసుకున్నా దానికి సంబంధించిన మెసేజ్‌లు రావడం లేదని రైతులు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. కొనుగోలుకు రెండు వారాల ముందే రైతులకు మేసేజ్ అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. మేసేజ్ వచ్చిన వెంటనే రైతులు పొగాకును సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో గోదాముల సమస్య ఉందని, దీన్ని అధిగమించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోదాముల పరిమితికి మించి పొగాకు రావడంతో వాటిని గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తరలిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 13వేల మంది పొగాకు రైతులు ఉండగా వారిలో వెయ్యి మంది రైతుల వద్ద ఉన్న పొగాకు కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఇకపై శనివారం రోజున కూడా కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పారదర్శకంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, మార్కెట్ యార్డ్ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఓటీఎస్ ప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలు మంజూరు

అద్దంకి, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో మల్లికార్జునస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలు మంజూరైనట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. దేవాలయం పునఃనిర్మాణానికి రూ.75 లక్షల అంచనా కాగా, రూ.25 లక్షలు గ్రామస్థులు సమకూర్చగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ గ్రాంట్‌గా రూ.50 లక్షలను మంజూరు చేస్తూ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు.

ధూపదీప నైవేద్యాల కింద 10 దేవాలయాలు ఎంపిక

ధూపదీప నైవేద్యాల కింద అద్దంకి నియోజకవర్గంలో 10 దేవాలయాలు ఎంపికైనట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలం చెరువు కొమ్ముపాలెం అంకమ్మవారి దేవాలయం, కోదండరామస్వామి దేవాలయం, ఉప్పలపాడులోని ఆంజనేయస్వామి దేవాలయం, పంగులూరు మండలం కోటపాడు లోని మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేం ద్రస్వామి దేవాలయం, అభయాంజనేయస్వామి దేవాలయం, కోదండరామస్వామి దేవాలయం, తూర్పుకొప్పెరపాడు లోని విఘ్నేశ్వరస్వామి దేవాలయం, పోలేరమ్మ అమ్మవారిదేవాలయం, నూజెళ్ళపల్లి లోని పోలేరమ్మ అమ్మ వారి దేవాలయం, కొరిశపాడు మండలం దైవాలరావూరు లోని పోలేరమ్మ దేవాలయంలు ఎంపికైనట్లు రవికుమార్ తెలిపారు.

పొగాకును అమ్ముకునే రైతులకు అవగాహన



మేదరమెట్లలో గోడౌన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

మేదరమెట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మవరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బర్లీ పొగాకు కేంద్రాన్ని కొరిశపాడు తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. శనివారం తమ్మవరంలోని కొనుగోలు కేంద్రానికి వెళ్లిన తహసీల్దార్ రైతులతో మాట్లాడారు. దేశంలోనే మొదటి సారిగా నల్ల బర్లీ పొగాకు కోనుగోలును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మండలంలోని రైతులకు అనుకూలంగా ఉండడానికి ఈ నెల 8వ తేదిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారన్నారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు నల్లబర్లీ పొగాకు చివరి ఆకు వరకు కోనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పొగాకు పండించిన రైతులు నిర్ధేశించిన తేదీలల్లో కోనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బర్లీ రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి,(మార్టూరు)జూలై19(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకును అమ్ము కోవడానికి కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లే రైతులు పాటించవలసిన నిబంధనలను ఏవో కుమారి రైతులకు వివరించారు. శనివారం ఆమె యద్దనపూడి మండలంలో వివిధ గ్రామాలలో పొగాకు రైతులను కలిశారు. జాగర్లమూడి గ్రామంలో రైతుల వద్ద ఉన్న పొగాకు చెక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. యద్దనపూడి మండల రైతులకు అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. అక్కడకు రైతులకు కేటాయించిన షెడ్యూల్‌లో మాత్రమే పొగాకు చెక్కులను తీసుకువెళ్లాలన్నారు. అదేవిధంగా పొగాకును గ్రేడింగ్ చేసే సమయంలో అన్యపదార్థాలు లేకుండా చూడాలన్నారు.పచ్చ నల్ల ఆకులను తీసివేసి చెక్కులుగా కట్టుకోవాలన్నారు. ముఖ్యంగా తేమశాతం 20 శాతం కంటే తక్కువగా ఉండాలన్నారు. చెక్కు సైజు 25 కిలోలు కంటె ఎక్కువ,150 కిలోలు కంటె తక్కువగా ఉండాలన్నారు. రైతులందరి దగ్గర పొగాకును కొనుగోలు చేస్తారన్నారు. ఎవరూ అధైర్యపడవద్దన్నారు.

పంగులూరు కొనుగోలు కేంద్రం మార్పు

పంగులూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పంగులూరు మార్కెట్‌యార్డ్‌లో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పొగాకు బేళ్లతో గోడౌన్లు నిండడంతో సోమవారం నుంచి మరో ప్రాంతంలో కొనుగోళ్లు కొనసాగించే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం గోడౌన్ సౌకర్యం ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్నారు. గత నెల 30న ప్రారంభమైన పంగులూరు కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 155 మంది రైతుల నుండి 2,528 బేళ్ల 2,095 క్వింటాళ్లను కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. 21వ తేదీ నుంచి ఈ నెల 31 వరకు సన్న చిన్నకారు రైతులకు తమ పొగాకు అమ్మకాలకు మార్క్‌ఫెడ్ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా వర్తమానాలు అందినట్లు సమాచారం. సోమవారం మండలానికి చెందిన 30 మంది రైతులు ఒక్కొక్క రైతు పది చెక్కుల వరకు కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునే విదంగా సమాచారమిచ్చారు. రైతులు తమ పొగాకు బేళ్లను ఏ కేంద్రంలో అమ్ముకోవాలనే సమాచారం సంబంధిత రైతులకు నిర్థీత వ్యవధిలో తెలియపరచనున్నట్లు సీఈవో లక్ష్మీదేవి తెలిపారు.

చేనేతలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చేనేత కార్మికులు

చీరాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని చేనేతలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. ఇటీవల చీరాల సిల్క్ కుప్పడం చీరకు జాతీయ స్థాయి గుర్తింపు రావడంతో శనివారం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తరువాత చేనేత రంగానికి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. అయితే అనుకోని సమస్యల కారణంగా సంక్షోభంలో ఉన్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టామని, అన్ని రకాల సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, మాస్టర్ వీవర్ సిద్ధి బుచ్చేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వార్డులో పారిశుధ్య పనులు చేపట్టాలి

- మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు



వీధులను పరిశీలిస్తున్న చైర్మన్

చీరాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో శానిటేషన్ నిర్వహణ విధిగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డులో చైర్మన్ సాంబశివరావు పర్యటించారు. ఈసందర్భంగా డ్రెయిన్లు శానిటేషన్ నిర్వహణ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల ఆరోగ్యంపై కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రెయిన్లలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ వంటివి చల్లాలని సూచించారు. చైర్మన్ వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకి, జూలై19 (ఆంధ్రజ్యోతి) : రైతుబంధు పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని రూ.2 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు పొందవచ్చని ఏఎంసీ చైర్‌పర్సన్ పద్మావతి అన్నారు. అద్దంకి ఏఎంసీ పాలకవర్గం తొలి సమావేశం శనివారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో చైర్‌పర్సన్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యాలయం భవనం శిధిలావస్థకు చేరినందున కొత్త భవనం మంజూరు చేయాలని, రైతు బజారుకు స్థలం కేటాయించాలని తీర్మానాలు చేశారు. వైస్‌చైర్మన్ దర్మవరపు నాగేశ్వరరావు, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

అద్దంకి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందా డు. పోలీసుల కథనం మేరకు మండలంలోని శింగరకొండపాలెనికి చెందిన ఎర్రిబోయిన వెంకట మణికంఠ(24) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 9న హైదరాబాద్ నుండి శింగరకొండపాలెం వచ్చాడు. మౌనంగా ఉంటుండడంతో అనుమానంతో సీతయ్య ప్రశ్నించాడు. చనిపోవాలని అనిపిస్తుందని తండ్రితో తెలిపి ముబావంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో 14వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో గడ్డి మందు తాగాడు. వాంతి చేసుకోవడాన్ని గమనించిన తండ్రి వెంటనే అద్దంకి లోని ప్రవేట్ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలించాడు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

- బాధితురాలికి గాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

మేదరమెట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో కొరిశపాడు ఫ్లైవర్ పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో హోటల్ నడుపుతున్న మహిళ మెడలో గొలుసును ఇద్దరు వ్యక్తులు లాక్కెళ్ళారు. ఈ క్రమంలో కింద పడిన మహిళకు గాయాలయ్యాయి. శనివారం కొరిశపాడుకు చెందిన గాలి సత్యవతి వద్దకు ఉదయం 6.30 గంటల సమయంలో టిఫిన్ కావాలని అడిగారు. టిఫిన్ ఇస్తుండగా, ఆమె మెడలోని 20 గ్రాముల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. దొంగలు గొలుసు లాగుతున్నప్పుడు ఆమె కింద పడడంతో తలకు రాయితగిలి తీవ్ర గాయమైంది. గోలుసు లాక్కున్న దొంగలు మోటర్ సైకిల్‌పై చిలకలూరిపేట వైపు వెళ్లారు. కొరిశపాడు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగమని పెళ్లి

- అదనపు కట్నం కావాలని వేధింపులు

అద్దంకి, జూలై19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతినగర్‌కు చెందిన కామినేని శ్రావణిని నర్సరావుపేట సమీపంలోని దోనెపూడి కి చెందిన కందుల నాగదేవతో ఏడాది క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉందని చెప్పి, కట్నంగా ఎకరా పొలం, 10 సవర్ల బంగారం తీసుకున్నారు. ఎలాంటి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం లేకపోగా, కట్నంగా ఇచ్చిన ఎకరా పొలాన్ని అమ్ముకొని రమ్మని భర్త నాగదేవతో పాటు కుటుంబసభ్యులు వేధింపులకు పాల్పడ్డారు. ఆ మేరకు బాధిత యువతి శ్రావణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు భర్త నాగదేవతో పాటు కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సౌమ్య



మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

పర్చూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పర్చూరు ప్రభుత్వ వైద్యశాల (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ జె.సౌమ్య పేర్కొన్నారు. స్థానిక వైద్యశాల బాధ్యతలు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వైద్యశాలలోని వసతులు వైద్యసేవల గురించి వివరించారు. గతంలో కొద్దిపాటి శస్త్రచికిత్సలకే పరిమితమైన వైద్యశాలలో నేడు క్లిష్టతమైన ఆపరేషన్‌లను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్పొరేట్ వైద్యశాలలకు ధీటుగా నేడు ప్రభుత్వం అన్ని వసతులను ప్రభుత్వ వైద్యశాలల్లో కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలీ, డాక్టర్ సింధు, సత్యదీప్తి, చంద్రకళ, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె చికిత్స వైద్య శిబిరం

మార్టూరు, జూలై19(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మార్టూరులో గుంటూరు వారి అపార్ట్‌మెంట్ ఆవరణలో హెల్ప్ వైద్యశాల విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత గుండెచికిత్స వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ కార్తీక్ నాయుడు, డాక్టర్ నాగకిరణ్‌లు రోగులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

జొన్నతాళిలో వైద్యసిబ్బంది పరీక్షలు

మార్టూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని జొన్నతాళి గ్రామంలో శనివారం 104 వైద్యబృందం ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని 35 మందికి హెచ్ఐవీ, సిఫిలిస్, హైపటైటిస్‌బి, సి పరీక్షలు నిర్వహించారు. అంతేగాకుండా వారికి ఈ వ్యాధులపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టరు పద్మజ, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ రాజేష్, ఏఎన్ఎం శివకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలను పెంచాలి

మార్టూరు, జూలై19(ఆంధ్రజ్యోతి): రానున్న రోజులలో ప్రభుత్వం ఉపాధ్యాయులకు గ్రేడింగ్ పాయింట్లు ఇవ్వనున్నారని, పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయాలని ఎంఈవో వస్త్రంనాయక్ అన్నారు. శనివారం మండలంలో నాలుగు పాఠశాలలో సముదాయాల సమావేశాలు నిర్వహించారు. వాటిలో మార్టూరు, ద్రోణాదుల, కోలలపూడి గ్రామాలలో జరిగిన పాఠశాలల సముదాయాల సమావేశానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిదంగా వలపర్లలో నిర్వహించిన సమావేశానికి రెండవ ఎంఈవో కే.ప్రేమలత హాజరయ్యారు. కార్యక్రమాలలో సీఆర్పీలు రమేష్, రామారావు, శ్రీనివాసరావు, తిరుపతమ్మలు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉండేది టీడీపీ ప్రభుత్వమే

మార్టూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు, వారికి అన్నివిధాలుగా అండగా ఉండేది టీడీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ నాయకుడు కమ్మ శివనాగేశ్వరరావు అన్నారు. సుపరిపాలన,తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి మార్టూరు గ్రామంలో నేతాజీనగర్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్టూరు పట్టణంలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు కృషి చేస్తున్నారన్నారు. అదేవిదంగా తల్లికి వందనం పథకంలో ప్రతి ఇంట బడికివెళ్లే బాల బాలికలకు వారి తల్లులు ఖాతాలో డబ్బులు పడేవిధంగా ముఖ్య మంత్రి చంద్రబాబు చేసిన కృషిని వి వరించారు. కార్యక్రమంలో మందపాటి అంజయ్య, ముక్తిపాటి సాయిబాబా, రాంబాబు, గొట్టిపాటి వెంకట్రావు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, నాగండ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిపాయల ఆటో బోల్తా

- వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఘటన



పడిపోయిన ట్రాలీ ఆటో

మార్టూరు, జూలై19(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలోని ఇసుకదర్శి ఫ్లైఓవర్ పై ఉల్లిపాయల లోడుతో వెళుతున్న టాటా ఏస్ ఆటోను వెనుక నుండి లారీ ఢీకొట్టింది. ఈ ఘటన శనివారం వేకువజామున చోటుచేసుకొంది. పోలీసులు కథనం ప్రకారం విజయవాడ నుంచి కలిగిరికి ఉల్లిపాయలను తీసుకువెళుతున్న వాహనాన్ని, జార్ఖండ్ నుంచి నెల్లూరుకు వెళుతున్న లారీ ఢీకొంది. లారీ డ్రైవరు నిద్రమత్తులో ఉండడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటో డ్రైవరు మహేష్ గాయపడగా, హైవే అంబులెన్స్ లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమయిన లారీ డ్రైవరు మొల్లి కన్నయ్యకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

పంగులూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కశ్యాపురం గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన పేద వృద్ధ మహిళ మేరుమూరి గోవిందమ్మ మట్టిఖర్చులకు విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. జిల్లా సంఘం, దాతల సహకారంతో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు సారధ్యంలో శనివారం గోవిందమ్మ కుమార్తె కోటపాటి లక్ష్మికి రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మునగంటి నరసింహాచారి, టి.రామకృష్ణ, తక్కెళ్లపాటి నాగేంద్రప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో వసతులపై అవగాహన

సంతమాగులూరు జూలై 19 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తోందని సంతమాగుళూరు ప్రాజెక్టు సీడీపీవో డి సుధా అన్నారు. కొప్పరం పంచాయతీ పరిధిలోని నెహ్రూనగరం ఎస్టీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం, వినూత్నమైన రీతిలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోషక విలువలతో కూడిన ఆహారము, రోజువారి కోడిగుడ్లు. ఆకుకూరలతో కూడిన భోజనము అందిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు యుక్తవయసు రాకుండా వివాహం చేయడం నేరమని, అలాంటి పరిస్థితులు మీ ప్రాంతాల్లో జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు, అనంతరం సూపర్వైజర్ సుష్మారాణి, మహిళా పోలీస్ వనజ,కార్యకర్త తిరుమల తదితరులు ర్యాలీ నిర్వహించారు.


పీ-4 సర్వేతో పేదల జీవితాల్లో వెలుగులు

సంతమాగులూరు జులై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పి-4 సర్వేతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. శనివారం మండలంలోని అడవిపాలెం, పాత మాగులూరు, గ్రామ సచివాలయంలో పీ-4 సర్వేపై గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలతో గ్రామ సభ నిర్వహించారు . ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పేదలను బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి మెరుగైన జీవనోపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. అందుకు దాతృత్వంతో ముందుకు వచ్చే మార్గదర్శులు(ఆర్థికంగా స్థిరపడినవారు) ఎంపికకు అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని ముగ్గురు గ్రిన్ అంబాసిడర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దిండు హనుమంతరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4పై సర్వే నిర్వహించాలి

అద్దంకిటౌన్ : పీ-4 సర్వేకు సంబంధించి బంగారు కుటుంబాల అవసరాలను గురించి ఈ నెల 21 నుంచి గ్రామాలల్లో సచివాలయ సిబ్బంది సర్వే ప్రారంభించాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య తెలిపారు. శనివారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయాల సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. బంగారు కుటుంబాల అవసరాల అధారిత సర్వేపై అందరు అవగాహన కలిగి ఉండి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 20 జూలై 2025

కావలి మున్సిపల్ కమిషనర్‌కు ఏసీబీ నోటీసు?

కావలి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో అక్కడ భవన నిర్మాణంలో జరిగిన అక్రమాలపై ప్రస్తుతం కావలి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న శ్రావన్‌కుమార్‌కు ఏసీబీ అధికారులు నోటీసు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. 15 రోజులలో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆ నోటీసులు పేర్కొన్నారు. ఈ విషయమై కమిషనర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను తిరుపతిలో ఉన్నానని తనకు ఎలాంటి నోటీసు అందలేదని చెప్పారు. అయితే జంగారెడ్డిగూడెంలో పని చేసేటప్పుడు ఒక భవన నిర్మాణంపై కేసు నడుస్తున్నట్లు చెప్పుకొచ్చారు.



మా గౌరవం ఏదీ!?

- జడ్పీటీసీ సభ్యుల ఏకరువు
- 30 నెలలుగా వేతనాల పెండింగ్
- ఒక్కొక్కరికి రూ.1.8 లక్షల వరకు బకాయి
- ఉమ్మడి జిల్లాలో 48 మంది సభ్యుల ఎదురుచూపు

నెల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ సభ్యులు... మండలస్థాయిలో ప్రథమ పౌరులు. కానీ ఏం లాభం. ఇంటా..బయట వారికి దక్కుతున్న విలువ అంతంత మాత్రమే. మండల స్థాయిలో వారికున్న అధికారాలు, వారికి దొరుకుతున్న గౌరవ మర్యాదల గురించి పక్కన పెడదాం. గౌరవ వేతనం విషయంలోనూ జడ్పీటీసీలకు గౌరవం దక్కడం లేదు. దీనికోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూడాల్సి వస్తోంది. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో తమ గోడు వెల్లబోసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పోనీ.. అలా నోరుతెరిచి అడిగినా ఫలితం ఉంటుందా అంటే అదీనూలేదు. ఒకటి కాదు... రెండు కాదు 30 నెలలుగా గౌరవ వేతనం కోసం వారంతా నిరీక్షిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం చట్టబద్ధంగా అందాల్సిన నిధులను పక్కదారి పట్టించి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయడమే కాదు.. ప్రజల చేత ఎన్నికకాబడిన జడ్పీటీసీ సభ్యులకు ఇవ్వాల్సిన గౌరవవేతనాన్ని రెండేళ్లపాటు ఇవ్వకుండా చేసింది. గత వైసీపీ పాలన పాపం కారణంగా ప్రస్తుత ప్రభుత్వం జడ్పీటీసీల గౌరవ వేతన బకాయిలను తీర్చడానికి తటపటాయిస్తోంది.

● గౌరవవేతనం కోసం విన్నపాలు

శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సభాధ్యక్షులు, అమాత్యులు, జిల్లా సర్వోన్నతాధికారుల ముందు ఆత్మాభిమానం చంపుకొని వేతనం కోసం ఏకరువు పెట్టారు. 'హక్కులు, అధికారాల పరంగా మాకున్న గౌరవ మర్యాదలు అంతంత మాత్రమే అనుకున్నాం.. ఇప్పుడు వేతనం విషయంలోనూ గౌరవం లేకుండా పోయింది. 30 నెలలుగా మాకు వేతనాలు ఇవ్వడం లేదంటే దీనిని ఏమనుకోవాలి." అంటూ నిలదీశారు.

వాస్తవంగా ఒక్కో జడ్పీటీసీ సభ్యుడికి నెలకు రూ.6వేల గౌరవవేతనంగా చెల్లించాలి. మెజారిటీ సభ్యులకు ఈ ఆరు వేలు పెద్ద లెక్క కాదు. కానీ ఇది రాజ్యాంగపరంగా వారికి దక్కే గౌరవం. ఆ గౌరవం తగ్గిపోయిందని, నెలనెలా అందాల్సిన ఆ వేతనం 30 నెలలుగా ఆగిపోవడం దేనికి సంకేతమని జడ్పీటీసీలు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని 46మంది జడ్పీటీసీలు, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు మొత్తం 48మంది ఉన్నారు. 30 నెలల వేతనం అంటే ఒక్కొక్కరికి 1.8 లక్షల రూపాయలు గౌరవం ఆగిపోయింది.

● జనరల్ ఫండ్స్ నుంచి సాధ్యమేనా!?

జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన విన్న రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తొలుత జడ్పీ జనరల్ ఫండ్ నుంచి బకాయి ఉన్న గౌరవవేతనాన్ని చెల్లించాలని అధికారులను సూచించారు. కలెక్టర్ ఆనంద్ సైతం ఆ సూచనను సమర్థించారు. ఆ విషయాన్ని పరిశీలించమని జడ్పీ సీఈఓను ఆదేశించారు. అయితే అలా చేయడం సాధ్యమయ్యే పని కాదని జడ్పీ అధికారులు అంటున్నారు. జడ్పీటీసీల గౌరవవేతనం సీజెఎఫ్ఎస్ నుంచి నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అవుతుంది. అలాంటప్పుడు జనరల్ ఫండ్స్‌ను గౌరవ వేతనాల కోసం డ్రా చేసి ఇస్తే ఆ నిధులను తిరిగి రాబట్టుకోవడం సాధ్యం కాదంటున్నారు. పైగా జనరల్ ఫండ్స్ డ్రా చేయాలన్నా దానికి కూడా సీజెఎఫ్ఎస్ అనుమతి ఇవ్వాల్సిందే. ఇందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జనరల్ ఫండ్స్ నుంచి గౌరవవేతనం డ్రా చేయడం అనేది సాధ్యం కాదని ఉద్యోగులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే గౌరవవేతనం విషయంలో స్పందిస్తే తప్ప మరో మార్గం లేదంటున్నారు. ప్రభుత్వం స్పందించే వరకు జడ్పీటీసీ సభ్యులు ఎదురుచూడక తప్పని పరిస్థితి.

● వైసీపీ హయాంలో 18నెలలు..

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందనే నిందను మూటగట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతనం విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యం చేసింది. 2023, జనవరి నుంచి ఆ ప్రభుత్వం గద్దె దిగే వరకు అంటే సుమారు 18 నెలల కాలం గౌరవవేతనాలు చెల్లించలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రాధాన్యతా అంశాల ప్రాతిపదికన పాత బకాయిలు చెల్లిస్తూ వస్తోంది. ఆ క్రమంలో జడ్పీటీసీల గౌరవవేతనాల బకాయిలు 30 నెలల కాలానికి పెరిగింది.

పాలిటెక్నిక్‌లో ఉపాధి కోర్సులపై విద్యార్థులు ఆసక్తి కనబరిచారు. ట్రిపుల్ ఈ, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కోర్సుల్లో సీట్లు అధికంగా భర్తీ అయ్యాయి. ఇప్పటికే తొలి విడత కౌన్సెలింగ్ పూర్తవగా, జిల్లాలోని తొమ్మిది కళాశాలల్లో 933 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన సీట్లను కూడా భర్తీ చేసేందుకు ప్రభుత్వం మరోసారి నోటిఫికేషన్ విడుదల చేయడంతో కౌన్సెలింగ్ కేంద్రాలు బిజీగా మారాయి.

ఉపాధి కోర్సులపైనే
ఆసక్తి

- ట్రిపుల్‌ఈ, మెకానికల్, సిరామిక్‌కు ఆదరణ
- పాలిసెట్ తొలివిడతలో 933 సీట్ల భర్తీ
- రెండోవిడత భర్తీకి మరో అవకాశం



నెల్లూరు(విద్య), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెల్లూరు వెంకటేశ్వరపురం, దర్గామిట్ట పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు ఆత్మకూరు, కావలి, కందుకూరు పాలిటెక్నిక్ కళాశాలలు, గీతాంజలి, దామిశెట్టి బాలసురేష్, వెంకటేశ్వర, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలల్లో పాలిటెక్నిక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించి పలు కోర్సుల్లో సీట్లు కేటాయించారు. అన్ని కళాశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ట్రిపుల్‌ఈ, మెకానికల్, ఈసీఈ కోర్సులను విద్యార్థులు ఎంచుకోగా మిగిలిన కోర్సుల్లోనూ ఆశాజనకంగానే సీట్లు భర్తీ అయ్యాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో తాము ఎంచుకున్న సీట్లు దక్కని వారు ప్రైవేట్ కళాశాలల్లో చేరుతున్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు కోర్సుల ఎంపిక చేసుకుంటున్నారని, రెండో విడతలో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయని అధికారులు తెలిపారు.

● రెండోవిడత అడ్మిషన్లు ప్రారంభం

పాలిటెక్నిక్‌లోని పలు కోర్సుల్లో చేరేందుకు తాజాగా రెండో విడత ప్రక్రియను కూడా ప్రారంభించారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్‌ల నమోదు చేయాలి. ఈ ప్రక్రియను ఈ నెల 20వతేదీ వరకు నిర్వహించి 21న తుది వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు అవకాశం కల్పించారు. అనంతరం 23న సీట్లు కేటాయించిన అనంతరం విద్యార్థులు తామెంచుకున్న కళాశాలల్లో 24 నుంచి 26వ తేదీ వరకు రిపోర్టు చేయాలని అధికారులు తెలిపారు. సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలని కన్వీనర్ డాక్టర్ రామారావు తెలిపారు.

కోర్సులు	సీట్లు	భర్తీ
ఏఐ	66	17
ఏఐఎం	66	8
ఏయూటీ	66	60
సీసీపీ	99	70
సీఎంఈ	528	188
సీఈ	264	206
ఈసీఈ	422	38
ఈఈఈ	363	132
ఎంఈ	330	214

వైద్యుల రిజిస్ట్రేషన్
రెన్యూవల్ ప్రారంభం

- ప్రభుత్వ వైద్యకళాశాలకు తరలివచ్చిన డాక్టర్లు
- నేటితో ముగియనున్న ప్రక్రియ

నెల్లూరు (వైద్యం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్స్, రీ రిజిస్ట్రేషన్లు జరిగాయి. రెండు రోజులపాటు జరిగే ఈ రిజిస్ట్రేషన్‌కు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వైద్యులు తరలివచ్చారు. మొదటి రోజు 300 మంది వైద్యులకు రీ రిజిస్ట్రేషన్‌తోపాటు రెన్యువల్స్ చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సెలింగ్ (ఎన్ఎంసీ) అధికారులు ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి, రెన్యువల్స్ చేపట్టారు. ఈ సందర్భంగా మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు విజయవాడలో మాత్రమే వైద్యుల రీ రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ జరిగేవని, ఇప్పుడు జిల్లాల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లు పైబడిన వైద్యులందరూ రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ చేసుకోవాలని కోరారు. గతంలో రీ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.40-50వేలు ఉండగా దాన్ని 75 ఏళ్లలోపు ఉన్న వారికి రూ.8వేలు, పైబడిన వారికి రూ.6వేలుగా ప్రభుత్వం నిర్ణయించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, ఎన్ఎంసీ సభ్యులు డాక్టర్ అశోక్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా, డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ చేస్తున్న అధికారులు



గాంధీబొమ్మ సెంటర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మున్సిపల్ కార్మికులను
ప్రభుత్వం ఆదుకోవాలి

- నిరసన ప్రదర్శనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు (వైద్యం) జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికులను ఆదుకోవాలని, వారి న్యాయమైన కోరికలను నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం నెల్లూరులోని వీఆర్‌సీ నుంచి గాంధీ బొమ్మ వరకు సీపీఎం శ్రేణులు నిర్వహించిన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండేళ్ల క్రితం ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తే అప్పటి ప్రభుత్వం 36 జీవోను తీసుకువచ్చి అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్డీఏ కూటమి కూడా తమ ప్రభుత్వం వస్తే అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆప్కాస్‌ను కాదని ప్రైవేట్ కాంట్రాక్టర్‌లకు పారిశుధ్య కార్మికులను అప్పగించేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. ఇదే అమలయితే పెద్ద ఎత్తున అవినీతి జరిగే అవకాశం ఉంటుందని, 25 మంది కార్మికులు పనిచేస్తే 50 మంది పేర్లు రాసుకునే అవకాశం ఉంటుందన్నారు. మున్సిపల్ కార్మికుల కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల టెండర్లు రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ నిరసనలో సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, ప్రసాద్, మాలకొండయ్య, సూర్యనారాయణ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అందని
యునాని వైద్యం

- వైద్యులు, మందుల కొరత
- రోజురోజుకు తగ్గుతున్న రోగుల సంఖ్య



ఉదయగిరి : ప్రభుత్వ యునాని వైద్యశాలలో అరకొరగా ఉన్న మందులు

ఉదయగిరి రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, ఆహారపు అలవాట్లతో రకరకాల వ్యాధులు ప్రజలను వెంటాడుతుండడంతో ప్రతినిత్యం అనేకమంది వైద్యశాలల వెంట పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. అలాంటి తరుణంలో ప్రస్తుతం వైద్యశాస్త్రంలో చోటు చేసుకుంటున్న మార్పుల దృష్ట్యా ఇటీవల ఆయుర్వేదం, యునాని, ఆక్యుపంక్చర్ వంటి చికిత్సలకు ప్రాధాన్యత పెరుగుతుంది. అందులో యునాని వైద్యం ప్రత్యేక స్థానం సంతరించుకుంది. అరబ్ దేశాల్లో తొలుత ప్రారంభమైన ఆ వైద్యం క్రమేణా దేశమంతటా విస్తరించడంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో 1983 నుంచి ప్రభుత్వాలు తమ ఆధీనంలో నిర్వహించేందుకు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా జిల్లాలోని ఉదయగిరి, నందవరం, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు, కసుమూరు ప్రాంతాల్లో వైద్యశాలలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలుత మెరుగైన ఫలితాలు సాధించినా క్రమేణా అధికారుల అలసత్వమో లేదా పాలకుల నిర్లక్ష్యమో తెలియదుగానీ ప్రస్తుతం వైద్యసేవలు అందని ద్రాక్షగా మారిపోయింది.

● వేధిస్తున్న వైద్యుల కొరత

ఏళ్ల తరబడి వైద్యుల కొరత వెంటాడుతుండటంతో యునాని వైద్యం పేరుకే అన్న చందంగా మారింది. ఉదయగిరి, నందవరం, ఆత్మకూరు వైద్యశాలల్లో ఇలాంటి పరిస్థితి దాపురించింది. నందవరంలో ఒక్క ఉద్యోగి కూడా లేకపోవడంతో ఆ వైద్యశాల తలుపులు తెరిచే పరిస్థితి లేదు. పలుచోట్ల ఎప్పుడు తలుపులు తీస్తారో, ఎప్పుడు మూస్తారో తెలియదు. వైద్యులు, స్వీపర్ వంటి ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఏళ్ల తరబడి ఒకరిద్దరు సిబ్బంది దీతో మొక్కుబడి సేవలు అందుతు న్నాయి. దీంతో ఆ వైద్యశాలలకు వెళ్లే రోగుల సంఖ్య తగ్గిపోతోంది.

● మెట్టలో మరీంత అధ్వానం

ఇదంతా ఒకవంతైతే మెట్ట ప్రాంత మైన ఉదయగిరిలో పరిస్థితి మరీ అధ్వా నంగా మారింది. కూలీ, నాలీ చేసుకొని జీవించే అధిక శాతం మంది యునాని వైద్యం వైపు మొగ్గు చూపుతుండటం విశేషం. అయితే ప్రస్తుతం వైద్యం అందే పరిస్థితి లేకపోవడంతో చేసేదేమిలేక ఇతర వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఓ చిన్నపాటి ఇరుకైన గదిలో ఆ వైద్యశాలను నిర్వహిస్తుండటంతో ప్రజలకు సరైన ప్రచారం కూడా లేకుండా పోతుంది. వీటికితోడు 2004 నుంచి వైద్యాధికారి పోస్టు ఖాళీగానే ఉంది. ఇతర సిబ్బంది నియామకం కూడా చేపట్టకపోవడంతో ప్రస్తుతం కాంట్రాక్టు బేసిక్ కింద విధులు నిర్వర్తించే ఫార్మాసిస్టే దిక్కుగా మారింది. దీనికితోడు రెండేళ్లుగా మందుల సరఫరా కూడా నిలిచిపోయింది. దీంతో వైద్యం కోసం వెళ్లిన రోగులు మందులు లేవనే సమాధా నంతో అస హనం వ్యక్తం చేస్తూ వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి యునాని వైద్య సేవలను మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పగిలిన సిమెంటు రోడ్డు





ఇది ఒకప్పటి నెక్లెస్ రోడ్డేనా!?

సాయంసంధ్యవేళ నగరవాసులకు ఆహ్లాదం పంచేందుకు నిర్మించిన నెక్లెస్‌రోడ్డు ఇది. 2014-19 మధ్య టీడీపీ హయాంలో స్వర్ణాల చెరువు గట్టును ఎంతో అందంగా తీర్చిదిద్దారు. వాకింగ్ చేసేందుకు ట్రాక్ ఏర్పాటుతోపాటు ఎంతోమంది మహనీయుల విగ్రహాలను కొలువు దీర్చారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ నెక్లెస్‌రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇంకేముంది.. ఒకప్పుడు ఎంతో అందంగా ఉన్న నెక్లెస్‌రోడ్డు ఇప్పుడు అందవిహీనంగా మారింది. సిమెంటు రోడ్డు పగిలిపోయి దర్శనమిస్తోంది. విగ్రహాల చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి నెక్లెస్‌రోడ్డుకు పూర్వ వైభవం తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)



నడిరోడ్డు ఇలా చీలింది!

అందవిహీనంగా ఉన్న వాకింగ్ ట్రాక్



విగ్రహాల చుట్టూ పిచ్చి మొక్కలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9445
వెండి కిలో ధర	రూ. 115800
వెండి ఒక గ్రాము	రూ.118.80

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో కావలికి 12వ ర్యాంకు

● అవార్డు అందుకున్న మున్సిపల్ అధికారులు

కావలి, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలలో కావలి పురపాలక సంఘానికి రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు వచ్చింది. దీంతో శనివారం తిరుపతిలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి నుంచి కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌లు ర్యాంకుకు సంబంధించిన అవార్డును అందుకున్నారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుతోనే అభివృద్ధి

కొండాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుతోనే అన్ని రంగాలు అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. కొండాపురంలో ఆపార్టీ 3వ మహాసభలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మిట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వరంగ సంస్థను ఏర్పాటు చేయలేదన్నారు. దేశంలో పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తున్నారే తప్ప సామాన్యులను, రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. ఏర్పాటు చేసిన సంస్థలు దివాళాతీస్తే వారికి రుణాలు రద్దు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, కావలి నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కొండబిట్రగుంటలో వైద్య శిబిరం

బిట్రగుంట, జూలై 19(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు సత్యనారాయ చార్యులు ఆధ్వర్యంలో ఉచిత మర్మకళ, ఆయుర్వేద వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. మర్మకళ హీలర్స్ ఏ.చంద్రశేఖర్, డీ.బాలాజీ, ఆయుర్వేద వైద్యుడు పెంచలరావు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, తులసీరాంబాబు, పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.8,54,723

వలేటివారిపాలెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.8,54,723 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కాకర్ల ఆర్థికసాయం

జలదంకి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెంకు చెందిన సత్తెనపల్లి చందు, పోట్లూరి శ్రీనివాసులు అగ్నిప్రమాదంలో ఇటీవల గాయపడ్డారు. వారికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆర్థికసాయం చేశారు. క్షతగాత్రులను కావలి వైద్యశాలలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఉప్పుటూరి సుధీర్‌బాబు శనివారం పరామర్శించి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున ఎమ్మెల్యే అందించిన ఆర్థికసాయంను కుటుంబ సభ్యులకు అందించారు.

ప్రాణాలైనా ఇస్తాం.. భూములు ఇవ్వం!

● జేఏసీ నేతృత్వంలో ఐక్యఉద్యమం

● గ్రామ పరిధిలో ఒక్కసెంటు భూమి ఇవ్వద్దు

● గ్రామసభలో కరేడు గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం

● పల్లెకారులు, ఎస్సీలు కూడా హాజరు

● రాజకీయ పార్టీల ప్రలోభాలకు లొంగకూడదని నిర్ణయం

కందుకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): చావనైనా చస్తాం కానీ.. మా భూములు మాత్రం పరిశ్రమల కోసం ఇచ్చేది లేదని చేసుకున్న తీర్మానం మేరకు.. చివరికంటూ పోరాటం చేసి విజయం సాధించి తీరాలని.. ప్రధాన రాజకీయ పార్టీలు ఆడుతున్న ఆటలో గ్రామ రైతులు పావులు కారాదని కరేడు గ్రామస్థులు తీర్మానం చేసుకున్నారు. ఇటీవల కాలంలో గ్రామానికి చెందిన కొందరు వైసీపీ నాయకులతో కలిసివెళ్లి జగన్‌ను కలవడం, మరోవైపు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కరేడు పంచాయతీ పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో పర్యటిస్తూ మీ భూములు సేకరించకుండా కాపాడే బాధ్యత నాదని పల్లెకారులు, పట్టపువాళ్లకు హామీలు ఇస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి కరేడులో గ్రామపెద్దలు, జేఏసీ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. గ్రామపెద్దలతో పాటు పంచాయతీ పరిధిలోని 19 శివారు గ్రామాలకు సంబంధించిన కులపెద్దలు, ముఖ్యమైన వారంతా ఈ సమావేశంలో పాల్గొనగా ఉద్యమాన్ని బలహీన పరిచేందుకు జరుగుతున్న పరిణామాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా కరేడులో ఎలాగైనా భూసేకరణ చేయాలన్న పట్టుదలతో అధికార టీడీపీ ఉండగా ప్రతిపక్ష వైసీపీ కూడా ఇండోసోల్ కంపెనీ కోసం పరోక్షంగా ఇదే లక్ష్యంతో తన వ్యూహాలను అమలు చేస్తున్నదని సమావేశంలో పాల్గొన్న అన్నివర్గాల పెద్దలు అభిప్రాయపడ్డారు. ఉద్యమాన్ని రాజకీయ పార్టీలు ప్రభావితం చేసేందుకు అవకాశం లేకుండా అన్ని వర్గాలకు చెందిన 40మందితో ఇటీవల జేఏసీ ఏర్పాటు చేసి ఉండగా అందుకు విరుద్ధంగా జేఏసీ చైర్మన్‌గా ఉన్న మిరియం శ్రీనివాసులు జగన్ వద్దకు వెళ్లడంపై గ్రామసభలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆయన తొందరపాటులో తప్పు జరిగిందని ఇకముందు అలా జరగనివ్వనని సభలో బహిరంగ క్షమాపణ చెప్పడం విశేషం. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలకు సమదూరంగా ఉండాలని, తీరప్రాంతంలోని టెంకాయచెట్లపాలెం, బట్టిసోమయ్యపాలెం, పల్లెపాలెం, కొత్తపల్లెపాలెం గ్రామాలను కూడా ప్రస్తుతానికి మినహాయించినా భూసేకరణ అంటూ జరిగితే వారి భూములకు కూడా రక్షణ ఉండదని అభిప్రాయపడిన గ్రామస్థులు ఉద్యమంలో కలిసికట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించారు.

● ఉద్యమ తీవ్రతకు నిర్ణయం

కరేడు ప్రజల భవిష్యత్తుకు సంబంధించి ఇది జీవన్మరణ సమస్య అయినందున రాజకీయ పార్టీల ఆటలో పావులం కావటానికి వీల్లేదని, ఇకముందు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మన ఉద్యమానికి మద్దతుగా కలిసివచ్చే పార్టీలను ఉద్యమంలో భాగస్వామ్యం చేద్దాం తప్ప పూర్తిస్థాయి కార్యాచరణ జేఏసీ నేతృత్వంలోనే జరగాలని తీర్మానించారు. ఇందుకోసం కరేడులో జేఏసీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ఇద్దరు, ముగ్గురు ఫుల్‌టైమర్లను నియమించాలని, ప్రభుత్వం వెనక్కుతగ్గి భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కు తీసుకునేవరకు పూర్తిస్థాయిలో పనిచేయాలని, ఎవరూ స్వతంత్ర్య నిర్ణయాలు తీసుకోటానికి వీల్లేదని నిర్ణయించారు. బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌ను తిరిగి ఉద్యమంలో యాక్టివ్ అయ్యేలా చూడాలని నిర్ణయించారు. జాతీయ రహదారిని దిగ్బంధించిన ఘటనలో 40 మందికి బెయిల్ వచ్చేలా హైకోర్టులో ఆయన కృషి చేయడంతోపాటు ఆర్థిక అండదండలు కూడా అందించినందున అలాంటివారిని ఉద్యమానికి దూరం చేసుకుంటే నష్టపోతామని అభిప్రాయపడ్డ జేఏసీ నేతల దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఇంటూరి



కందుకూరు : పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, అధికారులు

కందుకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపం వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవీ కాలనీలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి ప్లాస్టిక్ వద్దు - పేపరు బ్యాగులు ముద్దు నినాదంతో అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగించబోమని అధికారులు, ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. అనూష, పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కావలి : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎస్పీ పీ.శ్రీధర్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో పోలీస్‌లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక డీఎస్పీ కార్యాలయం నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం బ్రిడ్జి సెంటర్‌లో మానవహారం నిర్వహించి ప్లాస్టిక్ నియంత్రణ, పారిశుధ్యం మెరుగుదల కోసం అందరం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు ఫిరోజ్, గిరిబాబు, రాజేశ్వరరావు, పాపారావు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే లింగసముద్రం, వలేటివారిపాలెం, కొండాపురం, అల్లూరు తదితర మండలాల్లో అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు.



కావలి : బ్రిడ్జి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

అందరికీ బ్యాంకింగ్ సేవలు అందాలి : సబ్ కలెక్టరు



మాట్లాడుతున్న సబ్ కలెక్టరు శ్రీపూజ

కందుకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలకు కూడా బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ పేర్కొన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా 118వ వార్షికోత్స వ కార్యక్రమాన్ని శనివారం స్థానిక బ్రాంచ్‌లో నిర్వహించ గా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెస్తే వారు ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు రికవరీ శాతం కూడా బాగుంటుందని పేర్కొన్నారు. బ్యాంక్ మేనేజరు సుదర్శి మధుసూదనరావు మాట్లాడుతూ బ్యాంకుకు వచ్చే ఖాతాదారు లకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామ న్నారు. కార్యక్రమంలో సిబ్బంది పి.శ్రీనివాసులు, జయంత్ చేతన్, మౌనిక, కీర్తిదేవన్, సంషాద్ బాషా, సురేష్, బొల్లినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోపాడులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

కందుకూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోపాడులో శనివారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పర్యటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బీ కృష్ణారెడ్డి, హరికృష్ణ, ఆర్.రవి, టీ.ఏడుకొండలు, బీ.సింగయ్య, టీ.వీరేష్, బీ.నారాయణ పాల్గొన్నారు.

● లింగసముద్రం: మండలంలోని పెదపవనిలో వెలసియున్న గ్రామ దేవత పోలేరమ్మకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి సాంబయ్య, జి కల్పన, వంకాయలపాటి మాల్యాద్రి, రామిశెట్టి మాలకొండయ్య పాల్గొన్నారు.

బదిలీ అయిన వెటర్నరీ అసిస్టెంట్లకు సన్మానం

వలేటివారిపాలెం, జూలై 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలేటివారిపాలెం అసిస్టెంట్ డైరెక్టర్ చెన్నకేశవులను, చుండి, అంకభూపాలపురం గ్రామ సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్లుగా పని చేస్తూ బదిలీ అయిన ఉప్పుటూరి కిరణ్‌కుమార్, ఆరితోటి రమేష్‌లను వలేటివారిపాలెం ఏరియా పశువైద్యశాలలో శనివారం శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌రావు, వలేటివారిపాలెం, కందుకూరు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్‌లు చంద్రమోహన్, చెన్నకేశవులు, పోకూరు, లింగసముద్రం పశువైద్యులు సుధాకర్, సుబ్రహ్మణ్యం, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలి

కావలి(టౌన్), జూలై 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న కార్మికుల సమ్మె శనివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్యాలయం నుంచి చేపట్టిన ప్రదర్శన ట్రంకురోడ్డు మీదుగా ఆర్టీసీ కూడలి వరకు సాగి తిరిగి సమ్మె శిబిరం వద్దకు చేరుకుంది. పెంచలనరసయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు న్యాయం చేస్తామ ని చెప్పిన ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలని ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించి అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణమోహన్, పెంచలయ్య, మధుసూదన్‌రావు, యూనియన్ నేతలు తురకా శీనయ్య, బీమహేష్, ఓ.రమేష్, అనిత, చిన్నమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

హౌసింగ్‌లో అవినీతిపై చర్యలు తీసుకోండి

కావలి(టౌన్), జూలై 19(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ గోడౌన్‌లో స్టీల్, సిమెంట్ గోల్‌మాల్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత మిడతల రమేష్ ఆ పార్టీ నేతలతో కలిసి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ హౌసింగ్‌లో అవినీతి పరులను నీతివంతులుగా మార్చే ప్రక్రియను అధికారులు కావలి నుంచే ప్రారంభించారని ఆరోపించారు. 6,000 బస్తాల సిమెంట్, 24 టన్నుల స్టీల్ కావలి గోడౌన్‌లో మాయమైందన్న విషయాన్ని హౌసింగ్ అధికారుల ధ్రువీకరించారని ఆరోపించారు. అవినీతి అధికారులపై పోలీసు కేసులు పెట్టి విచరణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంద కిరణ్, బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు, నవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన తహసీల్దారు

కలిగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధన కొండూరులో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఇన్‌చార్జ తహసీల్దారు గిరీష్ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజన సదుపాయం, మౌలిక వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకోవాలని వార్డెన్ ఉమాశంకర్‌కు సూచించారు. వసతిగృహ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న ఫ్లోరోసిస్ వైద్య అధికారిణి దివ్య

ఏఎస్ పేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరమన పీహెచ్‌సీలో శనివారం జిల్లా ఫ్లోరోసిస్ వైద్య అధికారిణి దివ్య ఫ్లోరోసిస్ వ్యాధిపై వైద్య, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం కావలి ఎడవల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని 3,4,5వ తరగతి విద్యార్థులకు దంత పరీక్షలు చేసి విటమిన్ సి మాత్రలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతిరాణి, నాగ వినూత్న, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

అనంతసాగరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. కొత్తపల్లిలో గృహ నిర్మాణశాఖ అధికారులతో కలసి శనివారం పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇళ్లప్రగతిని పరిశీలించారు.

బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఉదయగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ మండలంలోని గడ్డంవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సముదాయ సమావేశాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల సముదాయ చైర్మన్‌లు షరీఫ్, వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ఉదయగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఏఈవోలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవిచంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. స్వచ్ఛాంధ్ర సాధిద్దాం

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



వింజమూరు: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. స్వచ్ఛాంధ్ర సాధిద్దాం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక బంగ్లా సెంటర్ నుంచి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పెరటితోటను ప్రారంభించి తోటలోని కూరగాయ మొక్కలను పరిశీలించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని దుకాణాల వద్దకు వెళ్లి దుకాణదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మండల నాయకులు గురజాల వాసు, ఆనంది రమణయ్య, డేగా మధు యాదవ్, బండారు సత్యనారాయణ, సర్పంచ్ సృజన, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ మాలకొండయ్య, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●ఉదయగిరి: పట్టణంలోని సినిమాహాలు వీధిలో ఎంపీడీవో అప్పాజీ, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాలు వీధులను శుభ్రం చేయించి ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రాంమోహన్ సిబ్బందిచే ఫైళ్ల గదులను శుభ్రం చేయిం చారు. అలాగే ఎస్ఐ అల శ్రీను ఉన్నత పాఠశాల విద్యార్థులచే రంగనాయకులస్వామి ఆలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్ట ర్ జీ.కృష్ణారెడ్డి అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

●దుత్తలూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి దుత్తలూరు సెంటర్ వరకు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం 565 జాతీయ రహదారిపై మానహారం ఏర్పాటు చేశారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నాగరాజు ఫైళ్ల గదులను శుభ్రం చేయించారు.

●సంగం: తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ ఆధ్వర్యంలో కార్యాలయంలో శుభ్రంచేసి చెత్త తొలగించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్, పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ అశోక్ క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. ఎస్ఐ రాజేష్ విద్యార్థులచే ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పాఠశాలల్లో హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఆట స్థలాలు శభ్రంచేసి ర్యాలీలు నిర్వహించారు.

●మర్రిపాడు: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలంటూ ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జనార్దన్ నాయుడు, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసరావు షాపులకు తిరిగి యజమానులకు అవగాహన కల్పించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు శాఖమూరి నారాయణ, ఎలగాల వెంకటేశ్వర్లు, అంగన్వాడీ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : తహసీల్దారు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించారు. ఎస్ఐ సైదులు విద్యార్థులతో కలసి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి, పాల్గొన్నారు.

●అనంతసాగరం: ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరమంటూ అనంతసాగరంలో శనివారం విద్యా ర్థులు, అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుడ్డ సంచులు వినియోగించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సూచించారు. ఈవోపీఆర్డీ రామ చంద్రయ్య, కార్యదర్శి అంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో శ్రీనివాసు లరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయ ప్రాంగ ణంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మి, ఏపీవో ఆజంఖాన్, సీహెచ్‌వో రాజశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్, సచివాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న చెత్తా చెదారంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ యస్దాని, కానిస్టేబుల్స్ ప్రవీణ్, విజయ్, రవి, విజయలక్ష్మి, తిరుపతిరావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సుమారు 18 శాఖల పరిధిలో అధికారులు పాల్గొనాల్సి ఉండగా కేవలం 8 మంది మాత్రమే హాజరయ్యారు. 24 మంది సర్పంచులకు గాను నలుగురు, 9 మంది ఎంపీటీసీలకు గాను నలుగురు మాత్రమే హాజరయ్యారు. కాగా, కొంతమంది అధికారులు తమ శాఖ పరిధిలోని సమాచారాన్ని వివరించారు. ఈవిషయమై ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్లపడియలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ పంచాయతీ గ్రామాల్లో టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించి కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వాడకొప్పు మాల్యాద్రి, నరసింహులనాయుడు, ఉప్పు కోనయ్య, దుదుకూరి రమణయ్య, పాపయ్య, అనిల్, గోపి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పీ-4 సర్వే గ్రామ సభలు

సీతారామపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 9 సచివాలయాల పరిధిలోని 14 పంచాయతీల్లో సోమవారం నుంచి పీ-4 సర్వే గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పాజీ శనివారం తెలిపారు. 21న అయ్యావారిపల్లి, నెమళ్లదిన్నె, జయపురం, పబ్బులేటిపల్లి, చిన్నాగంపల్లి, సింగారెడ్డిపల్లి, పంచాయతీల్లో, 22న దేవిశెట్టిపల్లి, దేవరాజుసూరయపల్లి, దేవమ్మచెరువు, బసినేనిపల్లి, బాలాయపల్లి, గుండుపల్లి, మారంరెడ్డిపల్లి, సీతారామపురం పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం

మున్సిపల్ ఉద్యోగుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

ఆత్మకూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయు నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకుడు జి శివప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు జీవో నెంబరు 36 ప్రకారం వెంటనే జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ యూనియన్ నాయకులు నాగేంద్ర, గురవయ్య, చానబాబు, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.